అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 17-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 352 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు

- సీజేఐ డివై చంద్రచూడ్



న్యూఢిల్లీ : గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతేడాది మహారాష్ట్రలో శివసేన కూటమి ఉద్ధవ్‌ఠాక్రే ప్రభుత్వాన్ని కూలదోసి... ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ రాజకీయ సంక్షోభానికి సంబంధించిన కేసును సుప్రీంకోర్టు విచారించింది. ఈ కేసులో ఉద్ధవ్ ప్రభుత్వ పతనానికి కారణమైన కేసును కోర్టు విచారిస్తున్నది. మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు. 'మనకు రెండు పార్టీల వ్యవస్థ లేదు. భారతదేశం బహుళ పార్టీల

...5లో

త్రిపురలో భారీ పోలింగ్

సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం ఓటింగ్

- బీజేపీ హింసాకాండ
- సీపీఐ(ఎం) కార్యకర్తలకు తీవ్ర గాయాలు



న్యూఢిల్లీ : బీజేపీ హింసాకాండ, బెదిరింపుల నడుమ త్రిపురలో భారీ పోలింగ్ జరిగింది. పోలింగ్‌కు నిర్ణీత సమయమైన సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం మంది ఓటు వేసినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఆ సమయంలో దాదాపు 1,500 బూత్‌ల్లో 1.35 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. దీంతో పోలింగ్ శాతం 85కి చేరుతుందని అంచనా. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 89.08 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగానే బూత్‌ల ముందు మహిళలతో పాటు పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 4 గంటల వరకూ ఈ ప్రక్రియ సాగింది. సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారికి టోకెన్లను

...5లో

ఓటు వేసిన మాణిక్ సర్కార్



మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ రామ్‌నగర్ నియోజకవర్గంలోని శిశువిహార్ హయ్యర్ సెకండరీ స్కూల్ బూత్‌లో ఓటు వేశారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలు శాయశక్తులా ప్రయత్నించారని ఆయన మీడియాతో అన్నారు. కానీ, బీజేపీ అక్రమాలకు పాల్పడుతోందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నిర్భయంగా ఓట్లు

...5లో



మతోన్మాదం పేరుతో దోపిడీ

హిందూత్వ, కార్పొరేట్లకు వ్యతిరేకంగా ద్విముఖ పోరు : ప్రకాష్‌కరత్

జ్యోతిబసు నగర్ నుంచి
నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కార్పొరేట్లు, మతోన్మాదులు కలిసికట్టుగా ప్రజలను దోపిడీ చేస్తున్నారనీ, దీనికోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఘర్షణలు సృష్టిస్తున్నారనీ, దీన్ని ఎదుర్కోవాలంటే ద్విముఖ వ్యూహంతో పనిచేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలో భాగంగా రెండోరోజు మతోన్మాదం, కార్పొరేట్ల అనుబంధం, వామపక్షాల కార్యాచరణ, రాజ్యాంగంపై దాడి, ఆహార, ఉపాధి భద్రత, భూ పంపిణీ వంటి అంశాలపై సదస్సు జరిగింది. 2014లో మోడీ గద్దెనెక్కిన నాటి నుంచి కార్పొరేట్లు, మతోన్మాద శక్తుల కలయిక బలోపేతమైందని అన్నారు. ఈ తొమ్మిదేండ్లలో సరళీకరణ విధానాలు మరింత ఊపందుకున్నాయని తెలిపారు. క్రోనీ క్యాపిటలిజానికి అనుకూలంగా ప్రధాని పనిచేస్తున్నారని తెలిపారు. 1991లో పివి నరసింహారావు సరళీకరణ విధానాలను బడ్జెట్‌లో ప్రతిపాదించిన సందర్భంలో... తాము సూచించిన విధానాలనే కాంగ్రెస్ అమలు చేస్తున్నదని అద్వానీ పార్లమెంటులో చెప్పారని గుర్తుచేశారు. నెహ్రూ ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలు ప్రభుత్వ రంగాన్ని బలపరుస్తుంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయని అన్నారు. మోడీ అన్ని రంగాలను ప్రయివేటీకరిస్తున్నారనీ, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ప్రభుత్వ సంపద పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని అన్నారు. హిందూత్వ సిద్ధాంతం మతతత్వం పేరుతో సామాజికంగానూ విభజన తీసుకొస్తున్నారనీ, సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అదానీ, అంబానీ, టాటాలు మోడీ పాలనలో సంతృప్తికరంగానే ఉన్నారని చెప్పారు. రతన్‌టాటా కూడా మోహన్‌భగవత్‌తో కలిసి 2015లో హెగ్డేవార్ సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. మోడీ నియంతృత్వం దిశగా ఏకపార్టీ పాలన సాగిస్తున్నారని అన్నారు. హిందూ రాష్ట్ర నినాదం అంటే మైనార్టీలపైనా దళితులపైనా దాడులేనన్నారు. కార్మికవర్గం రైతాంగం, వ్యవసాయ కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని వివరించారు. కార్పొరేట్ల కోసం దేశ రాజ్యాంగాన్నే మార్చాలని బీజేపీ చెబుతున్నదని అన్నారు. హిందూత్వం ఒక్కటే ప్రజలను ఉత్సాహపరుస్తుందని మోడీ చెబుతున్నారని అన్నారు. ఉత్తర భారతంలో హిందూత్వ నినాదం పేరుతో ప్రజల జీవితాలపై దాడి చేస్తున్నారని అన్నారు. దళిత గిరిజనులపై దాడులు చేస్తూ వారిని అణచివేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేయడం ద్వారానే బీజేపీని ఓడించలగమని పేర్కొన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకరంగా రాజకీయ ప్రత్యామ్నాయం కోసం పోరాడాలని తెలిపారు. ప్రజల మౌలిక అవసరాల కోసం

...2లో

భగత్‌సింగ్ జీవితాన్ని చదవండి

యువతకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపు

- రెడ్ బుక్స్ డే సందర్భంగా నెల రోజులపాటు అధ్యయనం
- 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రెడ్ బుక్స్ డే సందర్భంగా రాష్ట్రంలో ఈనెల 21 నుంచి మార్చి 23 (భగత్‌సింగ్ వర్ధంతి) వరకూ అధ్యయన మాసోత్సవాన్ని నిర్వహించనున్నట్టు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ నెల రోజులపాటు భగత్‌సింగ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, చుక్క రాములు, టి.సాగర్, నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్, సీజీఎం పి. ప్రభాకర్, బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, మేనేజర్ కృష్ణారెడ్డి, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఎ.మోహన్‌కృష్ణ, నియోకర్సర్ ఇన్‌చార్జి జగదీశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన భగత్‌సింగ్ జైలులో రాసిన వీలునామా, ఆయన సమకాలీకుడు శివవర్మ రాసిన పుస్తకాలను కలిపి ముద్రించిన పుస్తకంలోని

...5లో

బ్రెయిలీ లిపిలో కేసీఆర్ జీవిత చరిత్ర..

ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ సంక్షిప్త జీవిత చరిత్రను బ్రెయిలీ లిపిలో ముద్రించారు. అంధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని రాష్ట్ర మంత్రి కేటీఆర్ గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన అంధులతో ఆయన ఆ పుస్తకాన్ని చదివించుకుని అందులోని విశేషాలను తెలుసుకున్నారు. కేసీఆర్ బాల్యం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితం, ఆయన అలంకరించిన పదవులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, సీఎంగా ఆయన పాలన, తెలంగాణలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు తదితరాంశాలను ఆ పుస్తకంలో పొందుపరిచినట్టు వాసుదేవరెడ్డి ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు.

మంత్రి మాట్లాడుతూ... దేశంలోనే కేసీఆర్ గొప్ప నాయకుడనీ, ఆయన చరిత్రను భావి తరాల వారిని తెలపాల్సిన అవసరముందని చెప్పారు. అంధులకు కూడా ఆయన చరిత్రను తెలిపే విధంగా బ్రెయిలీ లిపిలో పుస్తకాన్ని తీసుకురావటం అభినందనీయమన్నారు. అంధ విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా కేటీఆర్ దృష్టికి తీసుకుపోయారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానంటూ ఆయన వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి, కార్పొరేషన్ల చైర్మెన్లు బాలమల్లు, వేణుగోపాలచారి, సతీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ప్రభాకర్, పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి

- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



నవతెలంగాణ - అదిక్ మెట్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 26 వేల మందికి పైగా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. 18 సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు అని.. కంటి వెలుగు, లెప్రసీ తదితర ప్రభుత్వం నిర్ణయించిన అన్ని పనులూ చేస్తున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే అనేక రెట్ల పనిభారం పెరిగిందని, కానీ వారికి ఫిక్స్‌డ్ వేతనం లేదని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీసం ప్రసూతి సెలవులు కూడా ప్రభుత్వం నేటికీ నిర్ణయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం ఇవ్వాలని 106 రోజులు ఆశా వర్కర్లు సమ్మె చేస్తే.. ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని ప్రగతిభవన్‌కు పిలిపించుకుని.. రూ.6000 ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా ఆశాలను మోసం చేస్తున్నారని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు ఆశా వర్కర్లకు

...5లో

ప్రాజెక్టులను పరిశీలించిన పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్‌మాన్



జలవనరుల పరిరక్షణ చర్యలపై అధ్యయనం

నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కొండపోచమ్మ ప్రాజెక్టును పంజాబ్ సీఎం భగవంత్ సింగ్‌మాన్ గురువారం పరిశీలించారు. రాష్ట్రంలో భూగర్భ జలాల పరిరక్షణ చర్యలను అధ్యయనం చేసేందుకు పంజాబ్ సీఎం నేతృత్వంలోని అధికారుల బృందం సిద్దిపేట జిల్లాలో

...5లో

ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ

గ్రూప్-2కు 5.51 లక్షల దరఖాస్తులు

- ముగిసిన గడువు
- త్వరలో పరీక్ష తేదీల ఖరారు : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943

...5లో



కూలుస్తాం.. పేలుస్తామంటే...
డిపాజిట్ కూడా రాదు

బీబీసీపై ఐటీ దాడులు దారుణం : హరీశ్ రావు

- సీఎం కేసీఆర్ జన్మదిన కానుకగా 100పడకల ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ -యాదగిరిగుట్ట

కూలుస్తాం.. పేలుస్తామని చిల్లర మాటలు మాట్లాడితే ప్రతి పక్షాలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులు, సచివాలయం నిర్మిస్తుంటే.. వాటిని పేల్చేస్తాం కూల్చేస్తాం అని ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని విమర్శించారు. పునాదులు వేసేవారి వెంట ఉంటారో.. కూల్చేవారి వెంట ఉంటారో ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని సైదాపురం సమీపంలో

...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

వాయు కాలుష్య నివారణకు రూ. 696 కోట్ల ప్రాజెక్టు

సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రంలో తొలి ఎఫ్జీడీ ఏర్పాటు

- గడువులోపే పనులు పూర్తిచేయాలి : ఎమ్‌డీ ఎన్. శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సంపూర్ణ కాలుష్య రహిత కేంద్రంగా తీర్చిదిద్దడానికి వీలుగా రూ.696 కోట్ల వ్యయంతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్జీడీ) అనుబంధ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.శ్రీధర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు, థర్మల్ ప్లాంట్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీలతో ఎమ్‌డీ సుదీర్ఘంగా సమీక్షించారు. పనులు గడువు కన్నా ముందే పూర్తిచేయాలని నిర్మాణ సంస్థ అయిన పీఈఎస్ ఇంజినీర్స్ ప్రయివేటు లిమిటెడ్స్‌ను ఆదేశించారు. యూనిట్ ఒకటికి సంబంధించిన ఎఫ్జీడీని 2024 జూన్ కల్లా, రెండో యూనిట్‌ను అదే ఏడాది సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలని ఆయన కాలపరిమితిని నిర్దేశించారు. ఈ సమీక్ష జీఎం (కోఆర్డినేషన్) ఎం. సురేష్, చీఫ్ టెక్నికల్ కన్సల్టెంట్ సంజయ్ కుమార్ సూర్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జనరల్ మేనేజర్ డి.ఎస్. సూర్యనారాయణ రాజు, చీఫ్ ఆఫ్ పవర్ ఎస్.వి.కె. విశ్వనాథరాజు, సివిల్ ఏజీఎం ప్రసాద్, ఎఫ్జీడీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కన్సల్టెంట్ (ఎన్.టి.పి.సి) సోహైల్ ఖాన్, నిర్మాణ ఏజెన్సీ (పి.ఈ.ఎస్) ఎమ్‌డీ వాసుదేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్జీడీతో వాయు శుద్ధి ప్రక్రియ ఇలా...

ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్‌గా పిలవబడే ఈ ప్రాజెక్టులో భాగంగా బొగ్గును మండించగా వచ్చే వాయువులో దాగి ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులను వేరుచేస్తారు. దానికోసం 150 మీటర్ల ఎత్తయిన ఒక చిమ్నీని ఏర్పాటు చేస్తారు. ఈ చిమ్నీలో కింది నుంచి పైకి వెళ్లే వాయువుపై కాల్షియం కార్బోనేట్ (తడి సున్నం)ను పైనుంచి బలంగా పంపిస్తారు. తద్వారా బొగ్గు మండించిన వాయువుల్లో ఉన్న సల్ఫర్ డయాక్సైడ్‌తో పలుదశల్లో తడి సున్నంతో రసాయనిక చర్య జరుగుతుంది ఈ ప్రక్రియలో వాయువులో ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులన్నింటినీ తడి సున్నం పీల్చుకుంటుంది.

తత్ఫలితంగా బయటకు విడుదల చేస్తున్న వాయువులలో సల్ఫర్ అనుబంధ వాయువుల శాతం ఘనపు మీటరుకు 200 మిల్లీ గ్రాములలోపే ఉంటుంది. ఈ రసాయనిక ప్రక్రియలో అంతిమంగా కాల్షియం సల్ఫేట్ అనే ఘన పదార్థం ఏర్పడుతుంది. దీనినే జిప్సం అంటారు. ఈ ప్రక్రియలో వెలువడే జిప్సాన్ని ఎరువులు, సిమెంటు, పేపర్, వస్త్ర పరిశ్రమ, నిర్మాణరంగంలో వినియోగిస్తున్నారు.

మతోన్మాదం పేరుతో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతూనే వారి హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. మోడీ మాట్లాడితే దేశ ఆర్థిక వ్యవస్థ ఐదో, మూడో స్థానంలో ఉందని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. హిందూత్వం అంటే సామాజిక దోపిడీ అమలు చేయడమేనని వివరించారు. ఆహార భద్రత అంశంపై ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ మాట్లాడుతూ దేశంలో ఆహార భద్రత అవసరాన్ని వివరించారు. ఆహార భద్రత అంటే భౌతికంగా అవసరాలు తీరడమే కాదని, ఆర్థికంగా అలసరాలు తీరాలని అన్నారు. సరైన ఆహారం, పౌష్టికాహారం ప్రజలకు అందాలన్నారు. నీరు, శానిటేషన్ మెరుగ్గా కల్పించాలన్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి 240 కోట్ల టన్నుల దిగుబడి వచ్చిందని, అయినా పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నామని తెలిపారు. ఆహార భద్రత విషయంలో 150 దేశాల్లో మనదేశం 137 స్థానంలో ఉందని, నేపాల్, బంగ్లాదేశ్‌కన్నా తక్కువస్థాయిలో ఉన్నామని చెప్పారు. గ్రామీణ ఉపాధి రోజురోజుకూ తగ్గుతున్న విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయేతర రంగాల్లోనూ ఉపాధి క్షీణించిందని, మహిళలు వలస బాట పడుతున్నారని అన్నారు. వేతనాల్లోనూ పురుషులకు మహిళలకు మధ్య వ్యత్యాసం చాలా తీవ్రంగా ఉందని అన్నారు. వేతనాల్లోనూ వ్యత్యాసం ఉందని 360 రూపాయలు పురుషులకు ఉంటే 269 రూపాయలు మహిళలకు ఇస్తున్నారని తెలిపారు. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేతనాలు చాలా తక్కువ అన్నారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, తమిళనాడు, హర్యానాలో వేతనాలు ఫర్వాలేదని వివరించారు. 2011-12 లెక్కల ప్రకారం ఆహార సంక్షోభం తీవ్రమైందని అన్నారు. ప్రజాపంపిణీలో కనీసావసర వస్తువులు కూడా సరఫరా చేయాలన్నారు. భూ పంపిణీపై ప్రొఫెసర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో 1.20 కోట్ల ఎకరాల సాగుకు ఉపయోగపడే మిగులు భూమి ఉందనీ, దాన్ని పంచడంలో ఇప్పటి వరకూ ఎవరూ ఆసక్తి చూపలేదని తెలిపారు. పైగా పరిశ్రమలకు కేటాయించేసి గ్రామీణ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేస్తున్నారని చెప్పారు. భూదాన్ భూములను చెప్పినా అవి ఎక్కడ ఉన్నాయో ఎవరి చేతుల్లో ఉన్నాయో ఇప్పటికీ లెక్క తెలియదని వివరించారు. భూ సంస్కరణల అమల్లోనూ తీవ్రలోపం జరిగిందని అన్నారు. ఏపీ తెలంగాణాలో 54శాతం భూమిలేని పేదలు ఉన్నారని వివరించారు. రాజ్యాంగంపై దాడి అనే అంశంపై వికాస్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ దోపిడీకి, మతోన్మాదానికి వీలుగా రాజ్యాంగాన్ని మార్చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారిని చంపడమో, అరెస్టులు చేయడం ద్వారా వారి పంతాన్ని నెగ్గించుకునేదిశగా పాలన చేస్తున్నారని విమర్శించారు. విజయరాఘవన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

మే నెలాఖరు వరకూ కంటి వెలుగు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమాన్ని మే నెలాఖరు వరకూ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు .ప్రిస్క్రిప్షన్ ఆధారంగా ఇచ్చే కంటి అద్దాల పంపిణీలో జాగ్రత్త వహించాలని సూచించారు. కంటి వెలుగు, ఇంటి స్థలాల ఎంపిక, పోడు భూముల కేటాయింపు, హరిత హారం తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో బీఆర్‌కేఆర్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్ర మవుతున్న నందున నేపథ్యంలో కంటి వెలుగు శిబిరాల వద్ద మంచినీటి సరఫరా, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూమి పట్టాలను ప్రధానం చేయడా నికి వీలుగా అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, నివాసం ఉంటున్న వారి వివరాలను శాసన సభ నియోజక వర్గాల వారీగా సేకరించి వెంటనే ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. పోడు భూములకు సంబంధించి యాజమాన్య పట్టాలను అందించేం దుకు జిల్లా స్థాయి కమిటీ లో ఆమోదం పొందిన వాటికి పాస్ పుస్తకాలను రూపొందించాల న్నారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా 2023-24లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశిం చారు. ప్రభుత్వ ఉత్తర్వులు 58, 59, 76, 118 జీవోల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వారందరికీ రిజిస్ట్రేషన్లు వెంటనే చేపట్టాలని తెలి పారు. ఆయా జిల్లాలో పూర్తయిన సమీకృత జిల్లా కలెక్టరేట్లను నూతన కార్యాలయాల్లోకి తరలించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గిరిజన సంక్షే మ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీని వాస రాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్య దర్శి రిజ్వీ, పీసీసీఎఫ్ డోబ్రియల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తప్పని సరిగా పర్యటించాలి

- ప్రజా సమస్యలను తెలుసుకోవాలి
- ఎస్పీలు, సీపీలకు డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు

నవతెలంగాణ -ప్రత్యేక ప్రతినిధి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడానికి ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. రాష్ట్ర పోలీసు ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు చేపట్టాలని కోరారు. కొత్తగా పోలీసు శాఖలో చేరబోయే ట్రైనీ కానిస్టేబుళ్లు, ఎస్ఐలకు ట్రైనింగ్ ఇచ్చే కళాశాలలో మౌళిక సదుపాయాల ఏర్పాటు, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు శాంతి భద్రతలు సవ్యంగా ఉంచాల్సిన, తీసుకోవలసిన చర్యలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అవసరమైన బడ్జెట్ తదితర అంశాలపై ఆయన ఎస్పీలు, సీపీలతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర పోలీసు శాఖను మరింతగా పటిష్ఠ పరచడానికి అవసరమైన నిధులు, కొత్తగా పోలీసు అధికారులు, సిబ్బంది నియామకాలకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు శాఖకు ఎంతగానో తోడ్పాటును అందచేస్తు న్నారని అన్నారు.

ఈ విధంగా ఏ రాష్ట్రంలోనూ పోలీసు శాఖకు ప్రభుత్వం అండగా నిలబడలేదని అంజనీ కుమార్ చెప్పారు. కొత్తగా నియమితుల వుతున్న ఎస్ఐ, కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ పూర్తి కావస్తున్నదనీ, వీరికి శిక్షణను ఇవ్వడానికి అవసరమైన సౌకర్యాలను పీటీసీలలో వెంటనే ఏర్పాటు చేసి సిద్ధంగా ఉండాలని ఆయన అధికారుల ను కోరారు. ప్రతి పోలీసు ట్రైనింగ్ కాలేజీలో టాయ్‌లెట్లు సరిగా నిర్వహించాలనీ, విద్యుత్ సౌకర్యం సరిగా ఉంచేలా చూసుకోవాలని వీటితో పాటు ఇతర సౌకర్యాలపైనా శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు.

సుప్రీంకోర్టును ఆయుధంగా వాడుకుంటున్న భారత వ్యతిరేక శక్తులు

- ఎడిటోరియల్‌లో ఆరెస్సెస్ ఆరోపణ

ఢిల్లీ : భారత్‌లో సమాజశ్రేయస్సు కోసం ప్రజాస్వామ్యయుత పద్ధతిలో పోరాడుతున్న హక్కుల కార్యకర్తలు, సామాజికవేత్తలు, పర్యావరణవేత్తలను ఆరెస్సెస్ తన ఎడిటోరియల్‌లో దేశవ్యతిరేక శక్తులుగా అభివర్ణించింది. వీరంతా భారత సుప్రీంకోర్టును ఒక ఆయుధంగా వాడుకుంటూ దేశ ప్రగతిని అడ్డుకుంటున్నారని పేర్కొన్నది. ఆరెస్సెస్ అనుబంధ మ్యాగజైన్ పాంచజన్యలో వచ్చిన ఎడిటోరియల్‌లో ఈ విధంగా ప్రస్తావించింది. "మానవ హక్కుల పేరుతో ఉగ్రవాదులను రక్షించిన ప్రయత్నాల తర్వాత.. పర్యావరణ: పేరుతో ఇప్పుడు భారత వృద్ధిని అడ్డుకుంటూ ఇబ్బందులు కలగజేస్తున్నారు" అని ఆరెస్సెస్ ఆరోపించింది.

ఇటీవల దేశంలో సంచలనం సృష్టించిన మోడీపై బీబీసీ డాక్యుమెంటరీని కేంద్రం కట్టడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అంశానికి సంబంధించి ఎడిటోరియల్‌లో సంఘ్ పై విధంగా పేర్కొనడం గమనార్హం. దేశవ్యతిరేక శక్తులు మన ప్రజాస్వామ్యంలోని నిబంధనలను అనుకూలంగా మార్చుకుంటున్నాయని తెలిపారు. బీబీసీ డాక్యుమెంటరీ ఒక కల్పితగాథ అనీ, భారత ప్రతిష్టను దిగజార్చే చర్య ఇది అని ఎడిటోరియల్‌లో వివరించింది.

కేసీఆర్ గొప్ప దార్శనికుడు

- మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కేసీఆర్ గొప్ప దార్శనికుడని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన 14 ఏండ్లపాటు ఉద్యమం నడిపారని గుర్తుచేశారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల తన పాలనతో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. విద్య వైద్యం, విద్యుత్, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో అనతికాలంలోనే ఊహించని చారిత్రక మార్పులను తెలంగాణ సాధించిందని తెలిపారు.

నేడు పీవీ మార్గ్‌లో వేడుకలు..

సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పీవీ మార్గ్ లోని సంజీవయ్య పార్కులో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఇతర మంత్రుల లతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, వివిధ కార్పొరేషన్ చైర్మెన్‌లు పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు మంత్రి తలసాని ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా కోలేటి ఫౌండేషన్ చీరల పంపిణీ..

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ తన ఫౌండేషన్ ద్వారా చీరల పంపిణీ చేపట్టారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నలుగురు నామినేషన్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి తొలిరోజు నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు. వారిలో కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి రెండు సెట్లు, అన్వర్ ఖాన్ రెండు సెట్లు, బి భుజంగరావు, గుర్రం చెన్నకేశవరెడ్డి ఒక్కో సెట్ నామినేషన్లను సమర్పించారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు.

కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆడియో వీడియో విడుదల

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మెన్ రామకృష్ణగౌడ్ ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. సంబంధిత ఆడియో, వీడియోను రాష్ట్ర మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లో ఆవిష్క రించారు. ఈ సందర్భం గా ఆయన రామకృష్ణ గౌడ్‌ను అభినందిం చారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు సముద్ర, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు రాజయ్య గౌడ్, ప్రేమ్ సాగర్ శ్రీశైలం, వహీద్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వాది, పేదల పెన్నిధి బి.యాదయ్య మరణం తీరని లోటు

- ఎం సూర్యనాయక్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పేదల పెన్నిధి బి. యాదయ్య మరణం పార్టీకి తీరని లోటని ట్రైఫెడ్ మాజీ సభ్యులు, సీనియర్ నేత ఎం. సూర్యనాయక్ తెలిపారు. నాటి కాంగ్రెస్ పాలకులతో మాట్లాడి హైదరాబాద్ నగరంలో ఆయన పేదల కోసం ఎన్నో గుడిసెలు వేయించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా, భాగ్యనగర్ బ్యాంక్ చైర్మెన్‌గా సేవలందించారని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేసిన ఆయన... దామోదర్ సంజీవయ్య హయాంలో ఎస్సీ, ఎస్టీ విభాగం చైర్మెన్‌గా అనేక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదల మెప్పుపొందారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, ఆయన మరణం పట్ల సంతాపాన్ని తెలిపారు.

శాస్త్రవేత్తల్లో మరింత సృజనాత్మకత పెంచాలి

- కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

శాస్త్రవేత్తలు మరింత సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ కోరారు. ప్రజలకు కొత్త ఆలోచనా నైపుణ్యాలను అందించేందుకు అన్ని విధాలా వారు కృషి చేయాలన్నారు. అందుకు ప్రభుత్వ ప్రయివేటు రంగాల సహకారాన్ని పెంచాల్సిన అవసరముందని తెలిపారు.

ఇందులో భాగంగా సమర్థవంతమైన నాయకత్వానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బెల్లా విస్టా క్యాంపస్‌లో నాయకత్వంపై నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. దేశాభివృద్ధిలో శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. వారికి మరింత సాంకేతికతను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేటి సమాజంలో శాస్త్రవేత్తలు క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. దేశంలోని శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు కొత్త ఆవిష్కరణల కోసం పని చేస్తున్నప్పుడు వారికి నిర్మాణాత్మక శిక్షణ అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా పలు కోర్సులను మంత్రి ప్రారంభించారు.



కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామాలు అతలాకుతలం

పోరాటాలు..సేవా ధృక్పథంతో సంఘ విస్తరణ : కార్యదర్శి నివేదికలో వెంకట్

- కొనసాగుతున్న వ్యవసాయ కార్మికసంఘం మహాసభ

జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కారణంగా గ్రామీణ భారతం అతలాకుతలమవుతోందనిఅఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. హౌరాలోని జ్యోతిబసునగర్(శరత్‌శ్చంద్ర ఆడిటోరియం)లో జరుగుతున్న 10వ మహాసభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర విధానాల కారణంగా వ్యవసాయ రంగం గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షోభంలో చిక్కుకుందని, దాని ఫలితం వ్యవసాయ కార్మికులపై తీవ్రస్థాయిలో పడుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోయి, పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పట్టణాల బాట పట్టాల్సివచ్చిందని చెప్పారు. కరోనా కాలంలో పట్టణాల్లో సైతం పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అదే సమయంలో బిలియనీర్లు పెరిగారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. మరోవైపు ఫాసిస్టు దాడులూ పెరుగుతున్నాయని, దీనికి బలవుతోందని కూడా నిరుపేదలు, వ్యవసాయ కార్మికులేనని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవడంతో పాటు, కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మహాసభ వేదికగా పిలుపునిచ్చారు.

హక్కులకోసం పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, భూమిలేని పేదలకు న్యాయం చేయాలని, అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలని చేస్తున్న పోరాటాల ఫలితంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో కదలిక వస్తున్నాయని తెలిపారు. హౌరాలోని జ్యోతిబసు నగర్లో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో రెండోరోజైన గురువారం పలు రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై మాట్లాడారు.

పోరాటాలతో ప్రభుత్వంలో కదలిక

పేదల భూములు లాక్కుంటున్న ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి నాగరాజు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ నుండి మాట్లాడిన నాగరాజు తెలిపారు. . సంఘం ఆధ్వర్యాన 11 రకాల అంశాలపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమల కోసం భూములు లాక్కుంటారని, దీనివల్ల ఎక్కువమంది పేదలు భూమి కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై తాము పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే దళితులకు పంచిన అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటుందని వివరించారు. దీనిపై పోరాటంలో అనేకమంది జైళ్లపాలు చేశారని వివరించారు. ఆందోళనకారులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని వివరించారు. భూ పోరాటాలు జరిగే ప్రాంతంలో నాయకులు, పోరాటాల్లో పాల్గొంటున్న వారిని పోలీసులు ముందుగా నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ భూములను కార్పొరేట్లకు కట్టబెతున్నారని, దీనిపైనా పోరాటాలు సాగిస్తున్నామని చెప్పారు.

కేంద్ర ఒత్తిడులు ఎదుర్కొంటున్నాం
రతీంద్రన్ కేరళ ప్రతినిధి

కేరళలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేరళ ప్రతినిధి రతీంద్రన్ తెలిపారు. పజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు చెప్పారు. దీన్ని తట్టుకోలేని కేంద్రం తనిఖీల పేరుతో వేధింపులకు దిగుతోందని చెప్పారు. ఎన్ఐఎ, ఇడిని అడ్డం పెట్టుకుని దాడులకు దిగుతోందన్నారు.

పట్టణాల్లో ఉపాధి కోసం పోరు
కోదండన్, తమిళనాడు ప్రతినిధి

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... తమిళ నాడులో పోరా టాలు నిర్వహిస్తున్నట్టు ఆ రాష్ట్ర ప్రతినిధి కోదండన్ తెలిపారు. దీనిపై 2021లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పోరాటాల ద్వారా విస్తరణ
బుర్రి ప్రసాదు, తెలంగాణ ప్రతినిధి



కోవిడ్ సమయంలో వ్యవసాయ కార్మిక సంఘం సేవా కార్యక్రమాలు అమలు చేసిందని తెలంగాణ తెలిపారు. అలా చేసిన పోరాటాల వల్ల కొత్త ప్రాంతాల్లోకి విస్తరించామని తెలిపారు. అనేక సామాజిక పరమైన అంశాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా కార్మికులు ఉద్యమంలోకి ఎక్కువగా వస్తున్నారని వివరించారు. వారిని మరింత చైతన్యం చేసేం దుకు అనేక సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే భూపోరాటాల్లోకి పెద్దఎత్తున పేదలు కదలివస్తున్నారని తెలిపారు. తెలంగాణాలో పెట్టిన ధరణి వెబ్‌సైట్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిపైనా పోరాడుతున్నామని చెప్పారు.

రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ



తెలంగాణా ప్రాంతంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ నుండి చర్చల్లో పాల్గొన్న రేపాకుల శ్రీనివాస్ చెప్పారు. మూడో మహాసభ ఖమ్మంలో లక్షమందితో నిర్వహించా మన్నారు. భూమి, ఇళ్లస్థలాలు, పోడుభూమి, భూములు కోల్పోతున్నవారు, ఉపాధి హామీ పథకంపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించా మన్నారు. ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ విషయంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండు చేస్తున్నట్లు తెలిపారు . ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో పేదల భూములను పరిశ్రమల పేరుతో ప్రభుత్వం లాక్కుంటోందన్నారు. దీనిపైనా ఆందోళన చేపట్టామన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల ముందు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.

మత విద్వేషాలను తిప్పికొట్టండి మహాసభలో తీర్మానం

- ప్రవేశపెట్టిన తుషార్‌ఘోష్, బలపరిచిన పళనిస్వామి

జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో రోజురోజకూ పెరుగుతున్న మత విద్వేషాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సంఘం జాతీయ సహాయ కార్యదర్శి తుషార్‌ఘోష్ ప్రతిపాదించగా తమిళనాడు ప్రతినిధి పళనిస్వామి బలపరిచారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఎక్కడికక్కడ ఐక్యం కావాలని తీర్మానంలో పేర్కొన్నారు బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికతత్వంపై దాడి పెరగడం ఆందోళనమని, మోడీ వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిందని తెలిపారు. అధికారిక సంస్థలను ఉపయోగించడం ద్వారా దీన్ని ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా లౌకికతత్వం ప్రమాదంలోకి వెళ్లిందని తీర్మానంలో పేర్కొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ఆలేరు, మోటకొండూరు మండలాల్లో జీపీ కార్మికుల పాదయాత్ర
- విజయవంతంగా వంద కిలోమీటర్లు పూర్తి



నవతెలంగాణ -ఆలేరు రూరల్

కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతాపురి, దిలవారిపూర్ గ్రామాల్లో కొనసాగింది. దిలవారిపూర్ గ్రామంలో జరిగిన సభలో పంచాయతీ కార్మికులు పాదయాత్ర బృందానికి తమ బాధలను విన్నవించుకున్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం నిర్ణయించాలని సుదీర్ఘకాలం పోరాటం చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనా లేకుండా జీవో నెంబర్ 51 విడుదల చేసి.. 500 జనాభాకు ఒక కార్మికుడు చొప్పున లెక్కించి వేతనాన్ని రూ.8500 నిర్ణయించిందన్నారు. అదనంగా ఉన్న కార్మికులకు ఎలాంటి వేతనాలూ చెల్లించడం లేదన్నారు. ఒక కార్మికునికి ఇచ్చే వేతనాన్ని అక్కడ పనిచేసే కార్మికులందరూ పంచుకుంటున్నామని, ఫలితంగా రూ.3500 నుంచి 4,500 మాత్రమే వేతనాలు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కారోబార్ బిల్ కలెక్టర్‌కు కేవలం రూ.6000 ఇస్తున్నారని కార్మికులు తెలిపారు. కుటుంబం గడవడం కష్టంగా ఉందని, పెరిగిన ఖర్చులకు తగినట్టు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం తామూ పాదయాత్రలో భాగస్వాములం అవుతామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి జీవో నెంబర్ 60 ప్రకారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తునికి మహేష్ వినోద్ కుమార్ బృందంగా పాదయాత్ర పాలకుర్తి నుంచి మొదలుకొని మొదలు పెట్టి హైదరాబాద్ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాదయాత్ర ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరాపార్క్ వద్ద ముగుస్తుందని తెలిపారు. అనంతరం పాదయాత్ర మోటకొండూరు మండలంలో కొనసాగింది. పాదయాత్రకు సంఘీభావంగా కలుగీత కార్మిక సంఘం రైతు సంఘం, సీపీఐ(ఎం), సీపీఐ, వివిధ సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, కలుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి జగదీష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఇక్బాల్, సీఐటీయూ మోటకొండూరు మండల అధ్యక్షులు కొల్లూరు ఆంజనేయులు, నాయకులు సంగి రాజు, ఆడెపు స్వామి, చెక్క దశరథ, అంజయ్య పాల్గొన్నారు.

సక్సెస్‌గా వంద కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి

పంచాయతీ కార్మికుల కోసం తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ చేస్తున్న పాదయాత్ర 100 కిలోమీటర్లకు చేరుకున్నది. పాదయాత్ర ఈ నెల 12న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభమైన విషయం తెలిసిందే. వరంగల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల మీదుగా యాద్రాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గానికి చేరుకున్నది. ఆ జిల్లాలోని మోటకొండూరు మండల కేంద్రంలో వంద కిలోమీటర్ల మైలురాయిని పాదయాత్ర చేరుకున్నది. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రతినెలా జీతాలివ్వాలనే డిమాండ్‌తో కొనసాగుతున్నది. వారికిస్తున్న రూ.8,500 జీతాన్ని ఇద్దరు, ముగ్గురు కార్మికులు పంచుకుంటున్న తీరును పాదయాత్ర బృందం ఎత్తిచూపుతున్నది.

కోమట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఇటుకుల పహాడ్‌లో ఇరు పార్టీల కార్యకర్తల తోపులాట
- చెప్పులు, కర్రలు విసురుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ -నకిరేకల్

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకలపాడు గ్రామంలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగి ఎంపీ కోమటిరెడ్డి పర్యటన ఉద్రిక్తంగా మారింది. గురువారం శాలిగౌరారం మండలంలోని ఇటుకుల పహాడ్‌లో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామంలో సీసీ రోడ్డు సక్రమంగా లేవని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అనడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా మైకు కనెక్షన్లను ఊడదీసి తోపులాటకు దిగారు. ఆలయ ప్రాంగణంలోకి చెప్పులు విసిరేశారు.

పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి

దరఖాస్తులను పున: పరిశీలించాలి

- 20న హైదరాబాద్‌లో ధర్నా: ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి. గిరిజనుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తిరిగి పరిశీలించాల'ని ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో సమన్వయ కమిటీ కన్వీనర్లు వేముల పల్లి వెంట్రామయ్య, కెచ్చెల రంగయ్య, అంజయ్య నాయక్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే, అటవీ హక్కులను కాలరాసే 'అటవీ సంరక్షణ నియమాలు- 2022'ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.. ఆ నియమాలను ఉపసంహరించాలని కోరుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటాయన్నారని తెలిపారు.. ఆదివాసులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములన్నింటికీ, ఈ నెల చివరినాటికి (11.5 లక్షల ఎకరాలకు) హక్కుపత్రాలు యిస్తామంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేయటాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అయితే గతంలో కూడా అనేకసార్లు ఈ విధంగా వాగ్దానాలు చేసి అమలు చేయలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రచారానికే పరిమితం కాకుండా హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

రోగనిరోధక శక్తిని పెంచుతాయి



మారుతున్న సీజన్‌తో చాలా మంది దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్, అలర్జీ వంటి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. బలహీనమైన రోగనిరోధక శక్తి కారణంగా ఇటువంటి సమస్యలు తలెత్తుతాయి. దీన్ని నివారించడానికి మన రోగనిరోధక శక్తిని పెంచుకోవడం చాలా ముఖ్యం. మన శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సీజనల్ పండ్లు, కూరగాయలను తీసుకోవడం చాలా అవసరం. సీజన్ మారుతున్న కొద్దీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టే జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే కొన్ని పండ్లు మీకు మేలు చేస్తాయి. అందుకే మీరు తినే ఆహారంలో ఈ ఐదు పండ్లను చేర్చుకోవడం వల్ల మీ రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. అంతే కాదు బరువు నియంత్రణలో కూడా ఇవి చాలా సహాయపడతాయి. ఇంతకీ ఆ పండ్లు, వాటి ప్రయోజనాలేంటో చూద్దాం...

బొప్పాయి: అన్ని సీజన్లలో చాలా సులభంగా లభించే పండ్లలో బొప్పాయి పండు ఒకటి. ఈ పండును ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండు బరువు నియంత్రణకు కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మంచి రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

స్ట్రాబెర్రీ: స్ట్రాబెర్రీ వసంత రుతువులో ఉత్తమ పండుగా పరిగణించబడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అదనంగా స్ట్రాబెర్రీలు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

బ్లాక్‌బెర్రీ: బ్లాక్‌బెర్రీలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. బ్లాక్‌బెర్రీ మెదడు ఆరోగ్యానికి మంచిది. అంతేకాకుండా బ్లాక్ బెర్రీ శరీరంలోని జీవక్రియను వేగవంతం చేయడంలో, మధుమేహం లక్షణాలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది.

చెర్రీస్: శక్తిని పెంచడంలో, నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో, మన మనసును విశ్రాంతిగా ఉంచడంలో చెర్రీస్ ఉపయోగపడతాయి. అంతేకాకుండా చెర్రీస్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో రక్తంలో యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.

నారింజ: సాధారణంగా మనలో చాలామంది చలికాలంలో చలి కారణంగా ఈ పండ్లను తినరు. అయితే ఆరెంజ్ శీతాకాలపు పండు. నారింజలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

ఇట్ల చేద్దాం



కండ్ల కింద నల్లటి వలయాలను తొలగించేందుకు దోసకాయ ఉత్తమమైనది. దోసకాయ ముక్కలు లేదా తురుము కనురెప్పల మీద పది నిమిషాల పాటు ఉంచండి. దీన్ని రోజుకు ఎన్ని సార్లు రిపీట్ చేసిన కూడా పర్వాలేదు. కండ్ల చుట్టూ ఉన్న నల్లటి మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది.

నెదురుగొమ్ముల శిల్ప... కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు... తరతరాలకి తరగని సిరులవుతారు.. అన్న మాటలను అక్షరాలా నిజం చేసిన మహిళా పారిశ్రామికవేత్త. రాళ్ళలో నిదురపోతున్న బొమ్మలకు ప్రాణం పోసే వ్యక్తి. పట్టు పురుగులను పెంచి పట్టుదారం తీసే శిల్పి. పేరుకు తగినట్టుగా తన జీవనాన్ని అద్భుతంగా మలుచుకొని అనతి కాలంలోనే అందరి మన్ననలకు పాత్రురాలైన ఆమె విజయ ప్రస్థానం నేటి మానవిలో...

బిజినెస్ ఉమెన్

దృష్టిపెడితే చాలు ఏదైనా సాధించొచ్చు



శిల్ప తల్లితండ్రులు నిర్మల, పొనుగోటి వెంకటేశ్వరరావు. వీరి స్వస్థలం సూర్యాపేట. భర్త నెదురుగొమ్ముల రవీందర్ రావు. వీరికొక పాప లక్ష్మీ శివాని. రైతు కుటుంబంలో పుట్టిన శిల్ప పల్లెటూరు వాతావరణంలో పెరిగి డిగ్రీ వరకు చదివారు. మొదట్లో చీరల వ్యాపారం చేసారు. ఇంకా ఏదో చేయాలనే తపన తనలో ఆరాటపెడుతుండగా భిన్నంగా చేయగలిగిన వ్యాపారాలేమిటి అన్న దిశలో తన ఆలోచనలను కొనసాగించారు. డెయిరీ పెట్టుకుందామా అనుకున్నారు. అది నడపడం కొంచం కష్టమనిపించింది. అప్పట్లో ఈమో ఫామ్స్ నడుస్తున్నాయి. ఒక ఫామ్ తీసుకుని మనం ఏదైనా చేయగలమా అని భర్తతో కలిసి బాగా ఆలోచించారు.

స్వయంగా పరిశీలించి

చుట్టు పక్కల గ్రామాల్లో ఫామ్స్‌లో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో ముందుగా పరిశీలించారు. అక్కడ కొందరు సెరికల్చర్ చేయడం శిల్ప దృష్టిని బాగా ఆకట్టుకుంది. పట్టుపురుగుల పెంపకం, వాటి నుంచి పట్టును వెలికి తీసే ప్రక్రియను సెరికల్చర్ అంటారు. సెరికల్చర్ చాలా దేశాల్లో ముఖ్యమైన దేశీయ పరిశ్రమ. ఈ పెంపకం ఎలా జరుగుతుందో తెలుసుకునేందుకు స్వయంగా ప్రతిరోజూ పట్టుపురుగుల పెంపకం చేస్తున్న ప్రాంతాలకు వెళ్ళి బాగా పరిశీలించి క్షుణ్ణంగా పరిశీలించేవారు. ఒక రైతు తన పొలంలో ఈ పెంపకంతో నెలకు లక్షరూపాయలు సంపాదించడం చూసాక మొదట కొన్ని ఎకరాల భూమి ఈ పెంపకానికి కావలసిన ప్రధానమైన వనరుగా భావించారు. వెంటనే సూర్యాపేట చుట్టుపక్కల గ్రామాల్లో కొన్ని ఎకరాలు స్థలం సేకరించే పనిని ప్రారంభించారు.

శిక్షణ తీసుకుని

తిమ్మాపురంలో తొమ్మిది ఎకరాల స్థలం కొనుగోలు చేసి తమ వ్యాపారం ఆ గ్రామం నుంచే మొదలు పెట్టారు. మొదట ఆ భూమి మల్బరి సాగుకు అనుకూలంగా ఉందో లేదో అని సాయిల్ టెస్ట్ చేయించారు. వ్యాపారం చేయాలనే సంకల్పం బలంగా ఏర్పరచుకున్నాక పనితనం, పట్టుదల కలిగిన శిల్ప అందులో నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవాలనుకున్నారు. మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకం ఎలా చేయాలో బెంగుళూరుకు వెళ్ళి శిక్షణ తీసుకున్నారు. ఇందుకు వి హబ్ అనే సంస్థ వారు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శిల్పకు అకౌంటింగ్, మార్కెటింగ్, బ్యాంకింగ్ వంటి అంశాలపై అవగాహనకు, క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి తోడ్పడ్డాయి.

తెలంగాణలో మొదటి మహిళగా...

రెండు ఎకరాల పొలంలో నెలకు 60 నుంచి 70 వేల వరకు సంపాదించ వచ్చని గ్రహించిన శిల్ప స్వయంగా కొన్నాళ్ళు మల్బరి మొక్కల పెంపకం చూసి పట్టుపురుగుల పెంపకం మొదలు పెట్టారు. 2014లో మొదలు పెట్టిన మొదటి సాగులో శిల్పకు వచ్చిన మొదటి లాభం నలభై వేలు. తర్వాత క్రమంగా పెంపకాన్ని దశల వారీగా పెంచుకుంటూ వచ్చారు. పట్టు పరిశ్రమలో ఛాకీ ప్రధాన ఘట్టం. ఉష్ణోగ్రత, తేమ, పారిశుధ్యం వీటిని గమనిస్తూ ఉండాలి. నాణ్యమైన మల్బరీ ఆకులను పట్టుపురుగులకు ఆహారంగా ఇవ్వాలి. ఇందుకోసం ఆటోమేటిక్ రీలింగ్ మిషన్ అవసరం ఎంతైనా ఉంది. ఈ మెషీన్‌ని ప్రభుత్వ సబ్సిడితో కొనుగోలు చేసిన తెలంగాణలోనే మొదటి మహిళ శిల్ప.

ఒక ఛాలెంజింగా...

ఒక తల్లి తన పిల్లలను సరైన పోషక పదార్థాలు పెట్టి పెంచితే ఆరోగ్యవంతంగా బిడ్డ ఎలా ఎదుగుతుందో అలాగే పట్టుపురుగులను కూడా నాణ్యమైన మల్బరీ ఆకులను దశలవారీగా అందజేస్తూ, ఎటువంటి తేడా లేకుండా తగిన ఉష్ణోగ్రత మధ్య పెంచితే మంచిగా ఎదుగుతాయి. దానికోసం రేరింగ్ షెడ్ ఏర్పాటు చేయాలి. పట్టుపురుగులకు వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలి. ఛాకీ పద్ధతి ద్వారా పట్టుపురుగులను పెంచి పట్టుగూళ్ళు అల్లడానికి అనువైన స్థలం, వాతావరణం, వెలుతురు అందించాలి. అప్పుడే సరైన పట్టుగూళ్ళు చేతికి వస్తాయి. మార్కెట్‌కి పంపేటపుడు కూడా గూళ్ళు చెదరకుండా పంపాలి. ఇక తగిన ధరను అందుకోవడంతో ప్రక్రియ ముగుస్తుంది. అన్ని దశలలో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలి. ఇంత కష్టాన్ని తన రోజు వారి జీవితంలో భాగం చేసుకుని భర్త సహాయ సహకారాలతో పనిచేస్తుంది శిల్ప. ఈ మొత్తం ప్రక్రియలో



కావలసిన చోట పనివాళ్ళను పెట్టుకుని వారికి జీతాలు ఇస్తూ ఒక ఛాలెంజింగా పట్టుపురుగుల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు శిల్ప.

మహిళలు ముందుకు వస్తే...

"మగవారు రైతులుగా పంటలను పండిస్తున్నారు. మల్బరీ సాగులో పట్టుపురుగుల పెంపకంలో పట్టుగూళ్ళ తయారీ ద్వారా నేను మహిళా రైతుగా, రైతే రాణిగా నిలబడ్డాను. నాలాగా మరికొందరు మహిళలు ముందుకు వస్తే వారికి పట్టుపురుగుల పెంపకంలో మెళుకువలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తాను" అంటూ ఎంతో ఉత్సాహంగా చెబుతున్నారు శిల్ప. ఆమె పనితనాన్ని ప్రశంసిస్తూ ఎన్నో అవార్డులు ఆమెను వెదుక్కుంటూ వచ్చాయి. ఉత్తమ CRC అవార్డు, ఉత్తమ రైతు, రైతు మిత్ర అవార్డులను మహిళా రైతుగా సెరికల్చర్ చేస్తూ శిల్ప అందుకున్నారు.

సమయం వృధా చేసుకోవద్దు

సేంద్రీయ పద్ధతిలో పట్టుపురుగులను పెంచి పట్టుదారం ఉత్పత్తికి దోహదం చేసే ఎస్.ఆర్. సిల్క్ నిర్వహణలో శిల్ప నైపుణ్యం కొత్తగా పట్టుపురుగుల పెంపకం చేపట్టే వారందరికీ మార్గదర్శకం. మహిళలు ఏ రంగంలో నైనా రాణించగలరు అని నిరూపిస్తూ పట్టుపురుగుల పెంపకంలో తనదైన విశిష్ట స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. పనిచేయాలన్న ఉత్సాహం, సాధించాలన్న పట్టుదలతో పాటు టీవీలు చూస్తూ సమయం వృధా చేయకుండా సమాజానికి పనికొచ్చే పనులపై దృష్టి పెడితే మనం ఏదైనా సాధించవచ్చంటారు శిల్ప.

వి హబ్ కృషి గొప్పది

శిల్ప జీవనం స్ఫూర్తిదాయకం. మహిళలకు చిన్న వయసులోనే పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతున్న వి హబ్ వారి కృషి ఎంతో గొప్పది. పట్టుపురుగుల పెంపకంలో నాణ్యమైన పట్టుదారం అందించే పట్టుగూళ్ళ తయారీ పరిశ్రమ సర్వదా ప్రశంసనీయం. శిల్ప ఏర్పరిచిన బాటలో మరెందరో మహిళలు ముందుకు సాగి పట్టుపురుగుల పెంపకంలో మంచి అభివృద్ధిని సాధించాలని మనసారా కోరుకుందాం.

- డా. సమ్మెట విజయ

నా కంటూ ఓ గుర్తింపు



"మొదట చేసిన చీరల వ్యాపారం నాకు మాత్రమే సంతృప్తి నిచ్చింది. కానీ పట్టు పురుగుల పెంపకం నాతో పాటు మరికొందరికి జీవనోపాధిని ఇవ్వగలిగాననే సంతృప్తిని ఇచ్చింది. అలాగే పట్టుపురుగుల పెంపకం ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తగా నాకంటూ ఓ గుర్తింపు తెచ్చి పెట్టింది. అన్నిటికీ మించి అంతులేని ఆత్మవిశ్వాసాన్ని నాలో నింపింది. పట్టుపురుగుల పెంపకంలో కొనసాగాలని నిర్ణయించుకున్న తర్వాత ప్రభుత్వ సహకారం లభించింది. ఆటోమేటిక్ రీలింగ్ మెషీన్ కొనుగోలు చేసినపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడంతో ఆకులను కత్తిరించడం మరింత సులభమైంది" అంటారు శిల్ప.

ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులొచ్చాయని వివరించారు. పరీక్ష తేదీలను త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల సంఖ్య అధారంగా గ్రూప్-2కు సంబంధించి ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే 439 పోస్టులకు 2015, డిసెంబర్ 30న తొలి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం విదితమే. ఆ తర్వాత 593 గ్రూప్-2 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 2016, సెప్టెంబర్ ఒకటో తేదీన 1,032 పోస్టుల భర్తీకి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. గ్రూప్-2కు 7,89,985 మంది దరఖాస్తు చేశారు. అదే ఏడాది నవంబర్ 11,13 తేదీల్లో నిర్వహించిన రాతపరీక్షల 5.17 లక్షల మంది హాజరయ్యారు. అంటే తొలి గ్రూప్-2 కంటే ప్రస్తుతం 2,38,042 దరఖాస్తులు తగ్గడం గమనార్హం. అప్పుడు ఒక్కో పోస్టుకు 765 మంది పోటీ పడ్డారు. ఇప్పుడు ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ పడుతున్నారు.

గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యం. బహుళపార్టీ ప్రజాస్వామ్యం అంటే.. మనం పొత్తుల యుగంలో వున్నాం. అయితే, ఎన్నికల ముందు కూటమి అనేది... ఆయా పార్టీల రాజకీయ సిద్ధాంతాలను బట్టి ఉంటుంది. బీజేపీ - శివసేన పార్టీల మధ్య ఎన్నికలకు ముందు పొత్తు వుంది. ఎన్నికల్లో పార్టీలు ఓటర్ల ముందుకెళ్లాంటే.. స్వతంత్రంగా కాకుండా.. కూటమి పార్టీల భాగస్వామ్య రాజకీయ ఎజెండాగానే వెళతాయి. ఓటరు కూడా.. వ్యక్తిగా కాకుండా రాజకీయ సిద్ధాంతాలకు, పార్టీ ప్రాజెక్టులకే ఓటు వేస్తాడు. గుర్రపు వ్యాపారం అనే మాట వింటుంటాం. ఈ మాటకు తగ్గట్టుగానే.. ఎవరికి వ్యతిరేకంగా (కాంగ్రెస్, ఎన్‌సీపీ) ఉద్ధవ్ వ్యతిరేకంగా పోటీ చేశారో.. చివరకు ఆ పార్టీల పొత్తుతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అందుకే ఆ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలే వ్యతిరేకంగా ఓటు వేశారు' అని కోర్టులో వాదించారు.

కాగా, తుషార్ మెహతా వాదనలపై.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ మాట్లాడుతూ... గవర్నర్ కార్యాలయం నుంచి ఇలాంటి ప్రకటనలు రాకూడదని అన్నారు. 'గవర్నర్ ఇదంతా చెబితే ఎలా వినగలరు? ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ ఇలా ఎలా చెబుతారు? వారు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినప్పుడు విశ్వాస ఓటు వేయమని గవర్నర్ అడిగారు. గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు అని మాత్రమే మేము చెబుతున్నాము' అని వ్యాఖ్యానించారు. ఈ కేసులో చాలా తీవ్రమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశముందని బెంచ్‌లోని న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమా కోహ్లి.. అభిప్రాయపడినట్టు ది ట్రిబ్యూన్ తెలిపింది. ఈ కేసు నబమ్ రెబియా కేసును తలపిస్తుందని బెంచ్ అభిప్రాయపడింది.

భగత్‌సింగ్ జీవితాన్ని చదవండి

(మొదటిపేజీ తరువాయి)

అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ యువతకు భగత్‌సింగ్ రోల్ మోడల్ అని అన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల గురించి చాలా మందికి తెలియదనీ, వాటిని నేటి యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో విప్లవయోధుల పాత్ర కీలకమన్నారు. వారి త్యాగాలు మరువలేనివని శ్లాఘించారు. మానవాళి విముక్తి కోసం కృషి చేస్తున్నది కమ్యూనిస్టులేనని ఈ సందర్భంగా తమ్మినేని పునరుద్ఘాటించారు.

కూలుస్తాం.. పేలుస్తామంటే... డిపాజిట్ కూడా రాదు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించనున్న 100 పడకల ఆస్పత్రికి గురువారం మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.35 కోట్లతో ఆస్పత్రిని నిర్మించనున్నారు. అనంతరం యాదగిరిగుట్టలో బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ సమావేశం డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కోసం బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించామని, ఇప్పటికే 9 నోటిఫికేషన్లు విడుదల చేశామని చెప్పారు. ఇది చూసి ఓర్వలేని బీజేపీ నాయకులు ఉద్యోగాలు ఇవ్వడం కూడా కుట్ర అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. యాదగిరిగుట్ట ప్రజలకు ఒకరోజు ముందే 100 పడకల ఆస్పత్రి ద్వారా కేసీఆర్ జన్మదిన కానుక అందిందని చెప్పారు. నల్లగొండ జిల్లాలో పెద్ద పెద్ద నాయకులు ఉన్నా గతంలో ఒక్క మెడికల్ కాలేజ్ కూడా ఏర్పాటు చేయలేదని, తాము ఇప్పటికే రెండు మెడికల్ కాలేజీలు స్థాపించామని త్వరలోనే యాదాద్రిలో కూడా ప్రకటిస్తామన్నారు. తెలంగాణలో లక్ష జనాభాకు ప్రస్తుతం 19 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయనీ, దేశంలో ఇలా ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. యాదాద్రిని భూలోక వైకుంఠంగా నిర్మించారని కొనియాడారు. ఆలేరు నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతమని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆలేరుకు సాగునీరు రప్పిస్తామన్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు యాదగిరిగుట్టలో ఆస్పత్రిని మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రికి శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఆర్టీఏ భూపాల్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డమీది రవీందర్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మెన్ బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశం పరువు పోతున్నది

బీబీసీపై ఐటీ రైడ్ చేయడం దారుణమని, ఇది చూసి జనం నవ్వుకుంటున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీబీసీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థ అని, ఆ సంస్థపై దాడి చేసి దేశం పరువు తీసేలా కేంద్రం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీసీలో ఒక వార్త వచ్చిందని తెల్లారి ఐటీ దాడులు చేయించారని, ప్రపంచం ముందు దేశం పరువు పోతున్నదని అన్నారు.. నాయకులకు ఓపిక, సమాధానం చెప్పే శక్తియుక్తులు ఉండాలని, ఇలా దాడులు సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఐటీ, ఈడీలను తోలుతా అంటే దేశం పరువు పోదా? అని ప్రశ్నించారు

యాదాద్రీశున్ని దర్శించుకున్న మంత్రి దంపతులు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని మంత్రి హరీశ్‌రావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. గర్భాలయంలో దర్శనానంతరం ఆశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు.

త్రిపురలో భారీ పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు రాష్ట్రవ్యాప్తంగా 3337 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ జరిగింది. వీటిలో 1100 పోలింగ్ స్టేషన్ల సున్నితమైనవి కాగా 28 సమస్యాత్మకమైనవిగా గుర్తించి తగిన ఏర్పాట్లను చేశారు. వివిధ పార్టీల నుంచి మొత్తం 259 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 28.13 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 13.99 లక్షల మందికి పైగా ఉండగా, పురుష ఓటర్లు 14.15 మందికి పైగా ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మానిక్ సాహా బొరోడోవాలి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. ఆయనపై ఆశిశ్ కుమార్ సాహాను కాంగ్రెస్ నిలిపింది.

బీజేపీ బెదిరింపులు.. లెఫ్ట్ నాయకులపై దాడులు

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అధికార బీజేపీ నాయకులు ప్రజలు, ప్రతిపక్ష నాయకులపై బెదిరింపులు, దాడులకు దిగారు. సెపాహిజల జిల్లాలోని బొక్సానగర్‌లో కొంత మంది గుర్తితెలియని వ్యక్తులు సీపీఐ(ఎం) స్థానిక కమిటీ కార్యదర్శిపై దాడికి దిగారు. ఆయనకు గాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. గోమతి జిల్లాలో సీపీఐ(ఎం) పోలింగ్ ఏజెంట్లను తీవ్రంగా కొట్టారు. పశ్చిమ త్రిపుర జిల్లాలో సీపీఐ(ఎం) అభ్యర్థి పబిత్రకర్ పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించిన వాహనాన్ని కాషాయమూకలు ధ్వంసం చేశాయి.బీజేపీ దాడిలో గాయపడిన సీపీఐ(ఎం) కార్యకర్తలు చందందాస్, షిపాన్ మజుందార్‌లను ఆస్పత్రిలో చేర్పారు. రాత్రి పేలుడు పదార్థాలను పేల్చి ఓటర్లలో భయాందోళనలు రేపేందుకు బీజేపీ సభ్యులు ప్రయత్నించారు.

బిషాల్‌గఢ్, శాంతిర్‌పూర్, రాంనగర్, ధన్‌పూర్, బముతియా, సూర్యమీనగర్, బ్రజాలాలో బీజేపీ సభ్యులు ఓటర్లను బెదిరించే ప్రయత్నం చేశారు. బీజేపీ బెదిరింపులకు ఓటర్లు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా చోట్ల దాడి చేసిన వారిపై ఓటర్లు నేరుగా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

రూ. 45 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం : ఈసీ

ప్రచారం సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు సహా రూ. 45 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. హెలికాప్టర్లు, విమానాల్లో త్రిపురకు అక్రమంగా డబ్బు తరలిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్వాధీనం చేసుకున్న ఉచితాలు 20 రెట్లు ఎక్కువని ఎన్నికల సంఘం తెలిపింది. సూర్యమణినగర్‌లో బీజేపీ కార్యకర్తలు 26,28,29 బూత్‌లపై దాడికి ప్రయత్నించారని త్రిపుర కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పటికీ తమ సొంత పార్టీలకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేసినందుకు త్రిపుర కాంగ్రెస్, బీజేపీలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నోటీసులు పంపారు.

త్రిముఖ పోరు

ఆది నుంచీ త్రిపుర ఎన్నికలు ఆసక్తిని రేపాయి. అధికార బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిని మళ్లీ అధికారంలోకి రాకుండా నిరోధించి.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలనే లక్ష్యంగా వామపక్షాలు, కాంగ్రెస్ ల కలయికతో కూటమి ఏర్పడింది. ఇక ప్రాంతీయ పార్టీగా ఏర్పాటైన టిప్రా మోతా రాష్ట్ర ఎన్నికలో బరిలో తొలి సారిగా నిలిచింది. దీంతో బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి, లెఫ్ట్-కాంగ్రెస్ కూటమి, టిప్రా మోతా ల మధ్య త్రిముఖ పోరు ఏర్పడింది. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే నెల 2న వెలువడనున్నాయి.

మొరాయించిన ఈవీఎంలు

త్రిపుర ఎన్నికల్లో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. 40 నుంచి 45 చోట్ల ఎన్నిలక మిషన్లు సరిగ్గా పని చేయలేదు. దీంతో ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు ఓటర్ల సహనాన్ని ప్రశ్నించారు. మహిళలు, వృద్ధులు క్యూలైన్లలో అవస్థలు పడ్డారు. మొరాయించిన ఈవీఎంల స్థానాల్లో కొత్తవాటిని అధికారులు అమర్చారు. అనంతరం ఎన్నికలు యథావిధిగా సాగాయి.

ఓటు వేసిన మాణిక్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

వేయకుండా అడ్డుకుంటున్నారని మాణిక్ సర్కార్ విమర్శించారు. సబ్‌రూమ్‌లో అభ్యర్థిగా ఉన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి తన నియోజకవర్గ బూత్‌లో ఓటు వేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బీజేపీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ ఫేస్‌బుక్‌లో సందేశం పంపారు. అగర్తల బోర్డోవాలి అభ్యర్థి ముఖ్యమంత్రి మాణిక్ సాహా తులసిబాటి బాలికల ఉన్నత పాఠశాల బూత్‌లో ఓటు వేశారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

రూ. 10 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఆశాలకు కంటి వెలుగు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అధికారుల వేధింపులు అరికట్టి ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి గంగమణి, ఎం.శ్రీలత, జి.కవిత, సాధన, హేమలత, ఎ.సునీత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పరిశీలించిన పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్‌మాన్

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించింది. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు రిజర్వాయర్ల గురించి సీఎం భగవంత్ సింగ్‌మాన్‌కు వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన జలవనరుల పథకాలను మ్యాప్‌లు, చార్టులతో వివరించారు. కాళేశ్వరం నుంచి 618 మీటర్ల ఎత్తులో కొండపోచమ్మ సాగర్ ఉందని, 15 టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్ నిర్మించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టు 2,85,280 ఎకరాలకు సాగునీటిని అందిస్తుందని తెలిపారు. అనంతరం ఎర్రవల్లి-నరస్నపేట గ్రామాల మధ్యలో చెక్‌డ్యాంను పంజాబ్ సీఎం పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా పంజాబ్ సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం భూగర్భ జలాల పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణలో మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంల నిర్మాణం పనులు బాగున్నాయని కితాబిచ్చారు. ఆయన వెంట గడ అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీవో విజయేందర్ రెడ్డి, దత్తత గ్రామాల సర్పంచ్ మొండి భాగ్యబిక్షపతి, మాధవి రాజిరెడ్డి, ఎంపీటీసీలు గోలినేందర్, ధనలక్ష్మి కృష్ణ, మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి తదితరులున్నారు.

సునిల్ యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దు..

- హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు

నవతెలంగాణ-హైదరాబాద్

ఏపీకి చెందిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడు సునీల్ యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దని వివేక భార్య సౌభాగ్యమ్మ కుమార్తె సునీతారెడ్డి హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. యాదవ్ కు బెయిల్ ఇస్తే కీలక సాక్షాదారాలు, ఆధారాలు తారుమారు చేసే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. బెయిల్ కోసం యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలను ఈ నెల 27కు కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 16న కాణిపాకంలో తన సోదరుడి సంస్మరణ కార్యక్రమానికి వెళ్లేందుకు వీలుగా బెయిల్ మంజూరు చేయాలని యాదవ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటీషన్‌ను గురువారం న్యాయమూర్తి జస్టిస్ సుమలత విచారించారు. ప్రతివాదుల వాదన నిమిత్తం విచారణను కోర్టు 27కు వాయిదా వేసింది.

మూడో రోజూ బీబీసీ కార్యాలయాల్లో ఐటి సోదాలు

న్యూఢిల్లీ : వరసగా మూడోరోజూ బీబీసీ ఇండియా కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ (ఐటి) సోదాలు కొనసాగాయి. న్యూఢిల్లీ, ముంబయిలోని బిబిసి కార్యాలయాల్లో గురువారం ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. కొంతమంది ఎంపిక చేసిన బీబీసీ సిబ్బందిని అధికారులు ప్రశ్నించి, సంస్థ ఆర్థిక సమాచారాన్ని సేకరించారు. మంగళవారం ఉదయం 11:30 నుంచి బిబిసి కార్యాలయాల్లో ఐటీ శాఖ సోదాలు ప్రారంభమయ్యాయి.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-పెగడపల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుద్దపల్లి గ్రామానికి చెందిన నలువాల రాములు (31) అనే వ్యక్తికి 8 సంవత్సరాల క్రితం ధర్మారం మండల పరిధిలోని బంజెరు పల్లె గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగింది. అప్పటినుండి వీరికి సంతానం లేకపోవడంతో తరచూ చిన్న చిన్న గొడవలు పడేవారు. ఇదే క్రమంలో బుధవారం ఇంట్లో నుండి రాములు వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా భర్త రాములు దొరకకపోవడంతో గురువారం ఉదయం భార్య మమత పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మమతను జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వెతుకుతున్న క్రమంలో రాములు గ్రామ శివారులోని అలుగొర్రె వద్ద పురుగుల మందు తాగి మృతి చెంది కనబడగా పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లి నలువాల నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్తయ్య తెలిపారు.

చలో వర్ష కొండ పోస్టర్లను ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో నిర్వహించే చలో వర్షకొండ పోస్టర్‌ను మహిళలు ఆవిష్కరించారు. బహుజన చక్రవర్తి రిజర్వేషన్ల పితామహుడు చత్రపతి సాహూ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ నెల 19న జరిగే కార్యక్రమంతో పాటు సాయంత్రం జరిగే బహిరంగ సభలో కూడా పాల్గొంటారని తెలిపారు. అగ్రవర్ణాల పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అప్సర బేగం, రుక్సానా బేగం, లక్ష్మి, సల్వాల, నాగమణి, బండారి రాజమణి, గొర్రె వనిత, వసంత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ ట్రైనర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో తెలంగాణ మోడల్ స్కూల్ ఒకేషనల్ ట్రైనర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను గురువారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి నవీన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో గురువారం సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్‌ను తాహసీల్దార్ మహేశ్వర్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఏకాగ్రతను కోల్పోకుండా చదువుపై పట్టు సాధించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణానికి మూలం ఉపన్యాస కళ

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంజి శశిధర్



నవతెలంగాణ-మెట్‌పల్లి: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణానికి మూలం ఉపన్యాస కళ అని, ఆ కళతోనే ఎవరికైనా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని డాక్టర్ గంజి శశిధర్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విస్తృత ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రశంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల వారికి నాయకత్వ లక్షణం ఉండటానికి ప్రధాన కారణం ఉపన్యాస కళ అని తెలిపారు. ఈ కళను సాధించటానికి నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు . అనంతరం కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ,. విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యాలను సంపాదించటానికి ఉపన్యాస కళ ప్రధానమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు బిల్ల రాజేందర్, మనోజ్ కుమార్, వెంకయ్య, మధుబాబు, గట్టయ్య, అంజయ్య, బోధనేతర సిబ్బంది అన్వేష్, బాబు, లక్ష్మీనారాయణ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కలిగేటి కవితా లక్ష్మణ్



నవతెలంగాణ-రామడుగు: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్ సూచించారు. మండలంలోని మోతె గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి నారాయణ, ఉప సర్పంచ్ సుధగోని మహేష్ గౌడ్, వార్డు సభ్యులు, ప్రోగ్రామ్ ఇంచార్జి డాక్టర్స్ ఫిరోజ్ ఖాన్, ఆప్టికల్ డాక్టర్ షకీల్, సూపర్‌వైజర్ రమణా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కత్తర్ ప్రమాద బాధితుడి

కుటుంబానికి ఇన్సూరెన్స్ అందజేత


ధన్యవాదాలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన సురాకంటి జగన్ రెడ్డి రెండు సంవత్సరాల క్రితం కత్తార్లు ఫిఫా ఫుట్బాల్ వరల్డ్ కప్ సన్నాహకాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కత్తర్ భారత కార్యాలయం అనుబంధం తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాజా నిజాముద్దీన్, ఎంబసీ ప్రధాన అధికారి నవ రతన్ ప్రభాత్ సహాయంతో కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ కత్తర్ రెండు లక్షల రియాల రూపాలను కుటుంబ సభ్యుల ఖాతాలో జమ చేయించారు. ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చేందుకు కృషి చేసిన కాజా నిజాముద్దీన్ రతన్ ప్రభాతను బాధిత కుటుంబ సభ్యుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాజా నిజాముద్దీన్ మాట్లాడుతూ.. న్యాయవాదులను నమ్మి మోసపోవద్దని భాదిత కుటుంబ సభ్యులకు సూచించారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం



నవతెలంగాణ-మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో పలు కిరాణా దుకాణాలు, చికెన్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని దుకాణ దారునికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ హోటల్స్ నిర్వహించే యజమానులు తినుబండారాలపై కవర్స్ ఉంచాలని, హోటల్స్‌ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిషేదిత ప్లాస్టిక్ కవర్స్ వాడరాదని సూచించారు. ప్లాస్టిక్ కవర్ వాడితే వెయ్యి రూపాయల నుండి 5 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిషేదాజ్ఞలు కొనసాగింపు

నవతెలంగాణ- కరీంనగర్ క్రైం: సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజే లపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 28 వరకు పొడిగిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఎల్. సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్నాయని, అలాగే శబ్ద కాలుష్యం నుండి ప్రజలను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొప్పగా చెప్పుకునేలా నగరం సిద్ధం

మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ-కరీంనగర్

నగర వాసులు మాది కరీంనగర్ అని చెప్పుకునేలా నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ బైపాస్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి గంగుల కమలాకర్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గౌడన్నలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం కోటి రూపాయలు కేటాయించి, తొలి విడతగా రూ.50 లక్షలు అందించామని, ఇప్పుడు మరో రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గౌడల సంక్షేమం కోసం తెలంగాణ సర్కార్ కృషి చేస్తుందని, ఆలయ పాలకవర్గం ఒక ట్రస్ట్‌గా ఏర్పడి రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని కాపాడుకోవాలని, ఆదాయాన్ని కూడా పెంచుకోవాలని సూచించారు. మార్చిలోగా టీటీడీ టెంపుల్‌కు భూమి పూజ నిర్వహిస్తామని తెలిపారు. నగర వాసులు పెద్దఎత్తున తరలివచ్చి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నవతెలంగాణ- కథలాపూర్: ఇటీవల గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేష్ అనారోగ్యంతో గల్ఫ్‌లో మృతిచెందగా ... విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల ప్రతినిధి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి డబ్బు, బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. గల్ఫ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గల్ఫ్ కార్మిక కుటుంబాలకు రూ.100 కోట్లు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లు లేని గల్ఫ్ కార్మిక కుటుంబాలకు పది లక్షలు ప్రకటించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, పీసీసీ సభ్యుడు తోట్ల అంజయ్య, చౌదరి, బప్పా శ్రీనివాస్, హరిప్రసాద్, గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, చారి, ఫిరోజ్ పాషా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్లకు ముందే కొండగట్టు అభివృద్ధికి రూ.500 కోట్లు వెచ్చించాలి

బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు డిమాండ్

నవతెలంగాణ-గంగాధర : సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.500 కోట్లను రానున్న ఎలక్షన్లకు ముందే కొండగట్టు అభివృద్ధికి వెచ్చించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు డిమాండ్ చేశారు. గంగాధర మండలం కొండాయపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్లకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, యువకులు కోరితే అక్రమ అరెస్టులు చేశారని అన్నారు. గూడులేని పేదలను మభ్యపెట్టడం వల్లే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల జాబితాలో తన పేరు లేదని ఒక నిరుపేద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడన్నారు. ఎల్లమ్మ ప్రాజెక్టు కట్ట మరమ్మతులు పూర్తికాక, సాగునీరు అందక పంట పొలాలు ఎండుతున్నాయని తెలిపారు. గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని, వెంటనే మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి 30 పడగల ఆస్పత్రి నిర్మిస్తానని ఎక్కడ చేశారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను దారి మళ్లిస్తూ ఆ నిధు లను రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని చెప్పుకునే దుస్థితి బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి వైద రామానుజం, చొప్పదండి నియోజక వర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, జిల్లా నాయకులు దూలం కళ్యాణ్, నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు, మల్యాల వినయ్, సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు కోల అశోక్, ప్రధాన కార్యదర్శులు, పంజాల, ప్రశాంత్, రేండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శక్తి కేంద్రం భూత్ కమిటీ సమావేశం

నవతెలంగాణ-వెల్గటూర్: కొత్తపేట శక్తి కేంద్రం భూత్ కమిటీల ఆధ్వర్యంలో బీజేపీ 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని మండల అధ్యక్షలు తంగళ్ల చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాడె సూర్య నారాయణ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు గాజుల మల్లేశం, కొత్తపేట గ్రామ సర్పంచ్ కొమ్ము రాంబాబు, రావు హన్మంత రావు, కందికట్ల రాజేశం, తిరుమల ప్రమోద్, దుర్గం రమేష్, కుశనపెల్లి నరేష్, దుర్గం రంజిత్, కంది వెంకటేష్, అరిగేల బక్కయ్య (స్వామి), నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో విద్యార్థుల హవా



నవతెలంగాణ-గంగాధర : ఇంటర్ స్టేట్ చాంపియన్షిప్ కరాటే పోటీల్లో గంగాధర మండల కేంద్రానికి చెందిన వివేకానంద హై స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో వివేకానంద విద్యార్థులు హవా కొనసాగించారు. కరాటే కటా విభాగంలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రోంజ్ మెడల్ పతకాలను స్వంతం చేసుకున్నారు. అక్షిత గోల్డ్ మెడల్ సాధించగా, స్వరన్ ప్రజ్వల్, అక్షిత్, అక్షర, నిఖిల్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. అదే విధంగా శ్రీహాసిని, సృజన, అక్షిత, సాహితిక, వరుధిని, భగీరథ్, శ్రీహాసిని, పవన్ కుమార్, హర్షవర్ధన్, అభినయ్ బ్రోంజ్ మెడల్ సాధించారు. వీరికి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ ప్రతినిధులు బెల్టులు షీల్డ్ లు, ప్రశంసా పత్రాలను పదానం చేశారు. విజేతలుగా నిలిచి పతకాలు సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, అనంతరెడ్డి, నర్సింగరావు అభినందించారు.

90 శాతం సబ్సిడీపై ఫామాయిల్ మొక్కలు

ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్



నవతెలంగాణ-కొత్తపల్లి: ఆయిల్ ఫామ్ సాగుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులంతా ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ అన్నారు. గురువారం మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో రైతు జంగా శ్రవణ్ వ్యవసాయ క్షేత్రంలో నాలుగు ఎకరాలలో ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయ అధికారి రంజిత్ మాట్లాడుతూ.. 90 శాతం సబ్సిడీపై ఫామాయిల్ మొక్కలను, డ్రిప్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంజిత్, సర్పంచ్ ఇల్లందుల రాజమ్మ శేఖర్ లోహియా గ్రూప్ ఆయిల్‌ఫామ్ వారి ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్, కారోబార్ జితేందర్, రైతులు పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడు

అప్పుల కోసం తరచూ గొడవలు

నవతెలంగాణ - రామడుగు : అప్పులు చేసిండని డబ్బుల విషయంపై తరచూ గొడవలు పడుతూ, దీంతోపాటు ఇబ్బందులకు గురి చేస్తుండని ఏకంగా సొంత అన్ననే గొడ్డలితో తలపై బాది చంపాడు తమ్ముడు. ఈ ఘటన రామడుగు మండలంలోని గుండి గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండి గ్రామానికి చెందిన గొల్లె యశోద దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు గొల్లె వినోద్(30), చిన్న కొడుకు గొల్లె హరీష్. కాగా పెద్ద కొడుకు వినోద్ చేసిన అప్పుల విషయంపై తమ్ముడు హరీష్ తరుచూ గొడవలు పడుతుండేవాడు. ఇదే విషయంపై తల్లితోపాటు ఇద్దరి మధ్య బుధవారం ఉదయం పది గంటలకు గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికెళ్లి భోజనం చేసి పడుకున్నారు. గురువారం ఉదయం ఐదు గంటలకు మంచంలో పడుకున్న వినోద్ తలపై తమ్ముడు హరీష్ గొడ్డలితో బాదగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి గొల్లె యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.అంజయ్య తెలిపారు. ఘటనా స్థలానికి కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ కరుణాకర్‌రావు, చొప్పదండి సీఐ గోపతి రవీందర్ పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన నిరుపేద అయిన పెద్దెల్లి లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా గ్రామానికి చెందిన దళిత నాయకులు బడుగు నరేష్ విషయాన్ని కార్పొరేటర్, ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కంసాల శ్రీనివాస్‌కు తెలపడంతో గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు అరుణ్, అజయ్, కోటేశ్వర్, సాంబయ్య, అశోక్, క్రాంతి, పృథ్వీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వడ్డెర కాలనీ గ్రామ శాఖ ఎన్నిక



నవతెలంగాణ - రాయికల్ : రాయికల్ మండలం వడ్డెర కాలనీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా బోదాసు రాజారెడ్డి, ఉపాధ్యక్షులుగా సుర సాయిలు,బోదాసు నర్సిరెడ్డి,ద్యవల్ల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా బోదాసు లక్ష్మీరాజం, కోశాధికారిగా పల్లపు వెంకటేష్,కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతలపల్లి గంగారెడ్డి,సీనియర్ నాయకులు మండ రమేష్, నర్సయ్య, నరేష్, సాయిలు, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

కొనసాగుతోన్న ఎస్ఐ, కానిస్టేబుల్ మహిళా అభ్యర్థుల సామర్థ్య పరీక్షలు



నవతెలంగాణ-కరీంనగర్ క్రైం: ఎస్ఐ, కానిస్టేబుల్ మహిళా అభ్యర్థులకు నిర్వహిస్తున్న శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలు గురువారం కొనసాగాయి. కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఎల్. సుబ్బరాయుడు పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నాటి పరీక్షలకు 1163 మంది హాజరు కావాల్సి ఉండగా 903 మంది హాజరయ్యారు. పరీక్షల్లో 493మంది అర్హత సాధించారు. 74 మంది అభ్యర్థులు అనారోగ్యం, ఇతర కారణాలను చూపుతూ ధృవీకరణ పత్రాలు సమర్పించారు. ధృవపత్రాల పరిశీలన అనంతరం సదరు అభ్యర్థులకు ఇతర తేదీల్లో హాజరయ్యేందుకు అనుమతించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (పరిపాలన), జి.చంద్రమోహన్, ఏసీపీలు వెంకటరెడ్డి, కాశయ్య, ప్రతాప్, ఎస్బిఐ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

6 నెలల చిన్నారిని లాలించిన ఏసీపీ ప్రతాప్:

గురువారం జరిగిన శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ ప్రతాప్ మానవత్వాన్ని చాటుకున్నారు. హుజురాబాద్‌కు చెందిన దంపతులు కొండ్రా అనూష సంపత్‌కు చెందిన 6నెలల చిన్నారిని సీటీసీ ఆవరణలో చెట్ల కింద కూర్చుని వారి బంధువులు పట్టుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న ఏసీపీ ప్రతాప్ అక్కడికి వెళ్లి ఆ చిన్నారిని ఎత్తుకుని లాలించారు. ఖాకీ యూనిఫారం ధరించిన పోలీసులు కఠినంగా ఉండరని, తాము కూడా ఈ సమాజంలోని సభ్యులమేననంటూ మానవతా హృదయాన్ని చాటిచెప్పారు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు పోలీసు అధికారులు ఏసీపీ ప్రతాప్‌ను అభినందించారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ-మల్యాల : మల్యాల మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ భాస్కర్ గురువారం సందర్శించారు. సిబ్బంది పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసుల వివరాలను ఆరా తీశారు. ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కొండగట్టు పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవి లకు సూచించారు. వారి వెంట డీఎస్పీ ప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-హుజురాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ తొగరు బిక్షపతి తండ్రి తోగరు మల్లయ్య బుధవారం గుండెపోటుతో మరణించారు. మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన మొలుగూరి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం బీఆర్ఎస్ నాయకులు, హుజురాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి గెల్లు శ్రీనివాస్ యాదవ్ దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ విరాళం

నవతెలంగాణ-గంగాధర : గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ కొచ్చగట్టు మల్లికార్జున స్వామి ఆలయానికి ఆ గ్రామ వాస్తవ్యులైన, ఎన్ఆర్ఐ చొల్లూరి నరేందర్ కుమార్-శ్యామల రూ. 1,50000 వేలను విరాళంగా అందించారు. వారం రోజుల పాటు ఆలయంలో బ్రహోత్సవాలు నిర్వహించబడగా, బుధవారం నాగవెల్లి పట్నంతో ముగిశాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆస్ట్రేలియాలో నివసిస్తున్న చొల్లూరి నరేందర్ కుమార్-శ్యామల ఆలయానికి విరాళం అందజేశారు. ఈ డబ్బుతో ఆలయం ఆవరణలో గ్రానైట్ ఫ్లోరింగ్, టైల్స్, పెయింటింగ్, కరెంట్ ఫిట్టింగ్ వంటి పనులు చేపట్టారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించిన నరేందర్-శ్యామల దంపతులను గ్రామస్తులు అభినందించారు.

'కంటి వెలుగు'ను సద్వినియ్యోగం చేసుకోవాలి


కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆకుల శంకరయ్య

నవతెలంగాణ-గంగాధర : ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రామాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ ఆకుల శంకరయ్య సూచించారు. గంగాధర మండలం మల్లాపూర్ గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకరయ్య మాట్లాడుతూ... ఉచితంగా నిర్వహించే కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియ్యోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం గ్రామ కార్యదర్శి శారద, వార్డు సభ్యులు మణెమ్మ, రేణుక బాబు, డాక్టర్ గుణవర్ధన్, సూపర్‌వైజర్ ప్రశాంతి, ఏఎన్ఎంలు తిరుమల, పద్మావతి, శ్రీలత పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలు నడపొద్దు

మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎండీ సిరారుద్దీన్


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

నవతెలంగాణ - శంకరపట్నం : మండల పరిధిలోని కేశవపట్నం నుండి ముత్తారం వెళ్లే వాహనాలను గురువారం హుజురాబాద్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ఎండీ సిరారుద్దిన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,. ఎలాంటి పత్రాలు లేని వాహనాలను నడపవద్దని, నడిపిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలో పత్రాలు లేని మూడు వాహనాలను సీజ్ చేసి కేశవపట్నం పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నవతెలంగాణ-కథలాపూర్: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పోసానిపేట గ్రామంలో ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పోతారం గ్రామంలో నూతన భవన నిర్మాణానికి, అంబారీపేటలో నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం బొమ్మెన గ్రామంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్మన్ దావా వసంత, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర రావు, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లా జైలులో కంటి వెలుగు పరీక్షలు



నవతెలంగాణ- కరీంనగర్ క్రైం: గురువారం జిల్లా జైలులో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా మేజిస్ట్రేట్, పరిపాలన అధికారి ఆర్.వి.కర్ణన్, జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ , జిల్లా వైద్యాధికారి డాక్టర్ జువారీయ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 313 మంది ఖైదీలకు గాను 157 మంది ఖైదీలకు కంటి పరీక్షలు నిర్వహించారు. మిగితా ఖైదీలకు శుక్రవారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జి.సమ్మయ్య, పర్యవేక్షణాధికారి జిల్లా కారాగారం కరీంనగర్, జిల్లా సబ్ జైళ్ల అధికారి కె. శ్రీనివాస్, జైలు వైద్య అధికారి రమేష్, జైలర్ శ్రీమేష్ , డిప్యూటీ జైలర్స్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హవ్వా..ఇదేం పని గురువు గారు!

విద్యార్థులతో పారిశుద్ధ్య పనులు చేయించిన టీచర్లు



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి.. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన టీచర్లు వారితో పాఠశాలలోని పలు పనులు చేయించడం విస్మయానికి గురి చేస్తోంది. ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో టీచర్లు పారిశుద్ధ్య పనులు చేయించడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 14న గ్రామానికి చెందిన ముక్కెర మహిత్ అనే ఆరో తరగతి విద్యార్థితో పాటు మరో విద్యార్థితో స్కూల్లో పారిశుద్ధ్యం పేరుకుపోవడంతో వాటి తీసివేత పనులు చేయించారు. పాఠశాల గేటు మూసి మరీ ఈ పనులు చేయించడం గమనార్హం. అదే సమయంలో అటువైపుగా వెళ్లిన ఓ వ్యక్తి విద్యార్థులచే టీచర్లు పనులు చేయిస్తున్న దృశ్యాలను తన ఫోన్‌లో చిత్రీకరించగా అవి సోషల్ మీడియాలో వైరలయ్యాయి. విద్యార్థులతో ఇష్టారీతిన పనులు చేయిస్తున్న టీచర్లపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. ఈ ఘటన జరిగి ఇప్పటికి మూడు రోజులు అవుతున్నా విద్యాశాఖ అధికారులు దీనిపై స్పందించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

కొత్తపల్లి మున్సిపాలిటీలో కళ్లద్దాల పంపిణీ

మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న రుద్ర రాజు

నవతెలంగాణ-కొత్తపల్లి: గురువారం కొత్తపెల్లి మున్సిపల్ పట్టణంలోని సంఘం వద్ద పీహెచ్‌సీ హాస్పిటల్‌లో కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చిన వారితో పాటు గతంలో ఆర్డర్ చేసినవి గురువారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు ఇంచార్జ్ శంకర్, హాస్పటల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆసిఫ్ నగర్‌లో హనుమాన్ ట్రేడర్స్ ప్రారంభం



నవతెలంగాణ-కొత్తపల్లి: మండలంలోని ఆసిఫ్‌నగర్ గ్రామంలో హనుమాన్ ట్రేడర్స్ కలర్స్ షాపును మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, జడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, జడ్పీ కో ఆప్షన్ సాబీర్, సర్పంచులు కడారి శాంత శ్రీనివాస్, నాయిని ప్రసాద్, ఎంపీటీసీలు దావ కమల మనోహర్, మంద రమేష్, షాపు నిర్వాహకులు అజయ్, యువకులు రాజు, రాజేష్, నవీన్, సుమన్, రాజు, ప్రదీప్, సోమన్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో రసమయి 'తొలిపొద్దు'

మంగళ హారతులతో ఆత్మీయ స్వాగతం



కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జనం మెచ్చిన నేత, గౌరవ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్, మానకొండూర్ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ కి తిమ్మాపూర్ మండల ప్రజలు జేజేలు పలుకుతూ ఘన స్వాగతం పలికారు. తొలిపొద్దు పర్యటనలో భాగంగా గురువారం ఆయన వేకువ జాము నుండి మధ్యాహ్నం వరకు తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్, మహాత్మా నగర్, తిమ్మాపూర్, రామకృష్ణ కాలనీ, ఇందిరానగర్, నుస్తులాపూర్, మక్తపల్లె, నల్లగొండ, పోలంపల్లి, మల్లాపూర్, మన్నెంపల్లి, పోరండ్ల గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఆత్మ కమిటీ ఛైర్మెన్ పాశం అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు దుండ్ర రాజయ్యయాదవ్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ మెంబర్ ఎలుక ఆంజనేయులు, కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, పోరండ్ల సహకార సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి స్వామి రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాసరెడ్డి, మెంగని రమేష్, గంగిపల్లి సంపత్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన తిమ్మాపూర్ సీఐ రమేష్



సీపీకి పుష్పగుచ్చం అందజేస్తున్న సీఐ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : ఇటీవల జరిగిన సీఐ జోనల్ ట్రాన్స్‌ఫర్‌లలో తిమ్మాపూర్ సర్కిల్ సీఐగా వచ్చిన పర్శ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం సీఐ పర్శ రమేష్ కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బా రాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేశారు.

రక్తదాన సంధానకర్త గణేష్‌కు జాతీయ సేవరత్న అవార్డు...



సేవ రత్న అవార్డు తీసుకుంటున్న గణేష్

నవతెలంగాణ - కోరుట్ల : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అంజలి మీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాల ప్రధానం బుధవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన గణేష్‌కు జాతీయ సేవా రత్న అవార్డును మంథని శాసన సభ్యుడు దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా రక్తదాన ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు 4050మందికి రక్తదాతలతో రక్తదానం చేయించి అనేక మందికి ప్రాణదాతగా నిలిచి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు అవార్డులు అందుకున్న సందర్భంగా జాతీయ సేవరత్న అవార్డుకు ఎంపిక చేసి అవార్డును ప్రధానం చేసి సత్కరించినట్టు తెలిపారు. అవార్డు అందుకున్న కటుకం గణేష్‌కు బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి షికారి గోపీకృష్ణ, మార్గదర్శి యూత్ నాయకులు లవంగ సాగర్ యువజన సంఘ నాయకులు సనావుద్దీన్, జాలా వినోద్, ఆనంద్, నాగరాజు, క్యాతం సృజన్, మహమ్మద్ అలీ, బాణాల శ్రీధర్, రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మెన్



రిబ్బన్ కటింగ్ చేస్తున్న చైర్మెన్ అన్నం లావణ్య అనిల్

నవతెలంగాణ - కోరుట్ల : పట్టణంలోని 26వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి కంటి వెలుగు అందించాలని ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందుబాటులో తీసుకు వచ్చిందని ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, ప్రజలు పాల్గొన్నారు.


'జ్యోతిష్మతి'లో హెల్త్ డైరీ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న డిఎల్ఎస్ఓ సుజన్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో బీసీడీఎస్ ఆధ్వర్యంలో 'హెల్త్ డైరీ యాప్', న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సుజన్ హాజరై మాట్లాడారు. డీఎల్ఎస్ఏ అందించే సేవల గురించి వివరించారు. అలాగే జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత మాట్లాడుతూ.. పిల్లల్లో రక్తహీనత నివారించడానికి తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించడమైనది. జిల్లాలో ప్రతి మహిళ హెల్త్ డైరీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో సరస్వతి, జ్యోతిష్మతి కళాశాల చైర్మెన్ జువ్వాడి సాగర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విశ్వప్రకాశ్‌బాబు, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రణీత, సూపర్ వైజర్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా జక్కని సంజయ్ కుమార్ నియామకం



రాష్ట్ర కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్

నవతెలంగాణ - శంకరపట్నం : బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శంకరపట్నం మండలం, మొలంగూర్ గ్రామానికి చెందిన జక్కని సంజయ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, బీఎస్పీ బీసీ స్టీరింగ్ కమిటీ ఉత్తర తెలంగాణ కన్వీనర్‌గా పనిచేస్తున్న సంజయ్ కుమార్‌ను, గురువారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియమాకాన్ని ప్రకటించారు. ఇంకా పూర్తిస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా బహుజన ఉద్యమ నిర్మాణం కోసం, పేద ప్రజల హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, తప్పక తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారాన్ని సాధిస్తామని తెలిపారు. తన నిమకానికి సహకరించిన రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్ గారికి, రాష్ట్ర కోఆర్డినేటర్లకు మిగతా రాష్ట్ర కమిటీ సభ్యులకు, అన్ని జిల్లాల అధ్యక్షులకు, ఇన్‌చార్జిలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు...

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవారెడ్డి



మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవారెడ్డి ఆరోపించారు. ప్రజల సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమం ద్వారా స్ట్రీట్ కార్నర్ సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం మండలంలోని నుస్తులాపూర్, కొత్తపల్లి గ్రామాల్లోని శక్తి కేంద్రాల్లో మండల శాఖ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లను జరిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వాసుదేవారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, మండల ఇన్‌చార్జి సాయిని మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు తాళ్లపెల్లి రాజు గౌడ్, బండి సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు తమ్మిశెట్టి మల్లయ్య, బూట్ల శ్రీనివాస్, మావురపు సంపత్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షుడు గడ్డం అరుణ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుర్శేటి రమేష్, ఆయా నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నాలుగు స్తంభాలాట నడుస్తోంది..

- రానున్న ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుంది
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ పాలక్ ఎర్రం మహేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

నవతెలంగాణ-గన్నేరువరం: రాష్ట్రంలో నాలుగు స్తంభాలాట పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజవర్గ పాలక్ ఎర్రం మహేశ్ అన్నారు. కరీంనగర్ ఎంపీ, రాష్ట్ర చీఫ్ బండి సంజయ్ నాయకత్వంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి ఖాసింపేట గ్రామ శక్తి కేంద్రంలోని బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షులు నగునూరి శంకర్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎర్రం మహేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, ఎర్రం మహేశ్ తదితరులు మాట్లాడుతూ.. అధిక వర్షాలు పడితే మండలంలో నాలుగు రోడ్లు జలదిగ్బంధంలో ఉంటున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీది సంక్షేమం.. బీఆర్ఎస్‌ది సంక్షోభం అని అన్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేసిందేమీ లేదని అన్నారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ .. నయా నైజాం పాలన చేస్తున్నాడని విమర్శించారు. ప్రజలను మోసం చేస్తున్న కుటుంబ పాలనను అంతం చేసి బీజేపీ పాలనకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, సొల్లు అజయ్ వర్మ, డాక్టర్ పుల్లెల పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు గడ్డం సుమిత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ బూత్ అధ్యక్షులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడాలి

- సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి
- భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్



విద్యార్థి చేతి పై కిరోసిన్ తో మంటలు లేపుతున్న నరేష్

నవతెలంగాణ-పెగడపల్లి : బాల్యం దశలోనే విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడాలని, సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం జేరిపోతుల సతీష్ అధ్యక్షతన మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ... మూఢ నమ్మకాలు లేని సమాజం కోసం విద్యార్థులు, యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల అవగాహన కోసం ఇంద్రజాల ప్రదర్శనలు, పలు ప్రయోగాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుజాత, ప్రవీణ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో 'జిల్లా స్థాయి సైబర్ హుడ్ యూత్ పార్లమెంట్'



ముఖ్య అతిథులకు మెమోంటో అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రీయ సంఘటన కరీంనగర్, ఎన్ఎస్ఎస్ సహకారంతో 'జిల్లా స్థాయి సైబర్ హుడ్ యూత్ పార్లమెంట్' అనే అంశంపైన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు అవగాహన కలిగించారు. మొదటగా నెహ్రూ యువ కేంద్రీయ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి.రవీందర్ పలు అంశాలను కూడా వివరించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మెన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సైబర్ హుడ్ యూత్ పార్లమెంట్‌కి సంబంధించిన అంశాలను క్లుప్తంగా వివరించుటకు ఏర్పాటుచేసిన నెహ్రూ యువ కేంద్రీయ సంఘటన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇండియా, జీ-20 ప్రెసిడెన్సీ దాని ప్రాముఖ్యతను వివరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రపంచంలో వస్తున్న సాంకేతిక మార్పుల గురించి, అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి నూతన విజ్ఞానం పట్ల విద్యార్థులు సమగ్ర విజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా 1వ, 2వ, 3వ, 4వ పారిశ్రామిక విప్లవంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు వాటి ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగార్జున ఇండియా యొక్క జి-20 ప్రెసిడెన్సీ, భారతదేశం సింధూ నాగరికత కాలంలోనే భూగర్భ డ్రైనేజ్, నలంద, నాగార్జున యూనివర్సిటీలు ఉండేవని వాటిని ఆధారం చేసుకుని నేటి కాలంలో ఉన్న ప్రభుత్వం వారు ఇంకా మెరుగైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యకుడు డాక్టర్ ఎంఏ కరీం మాట్లాడుతూ.. మనస్సుకు సంబంధించిన కొన్ని చిట్కాలను, విద్యార్థులు చిన్న చిన్న సంఘటన పట్ల ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం న్యాయవాది డాక్టర్ జి.కొమురయ్య వాతావరణ మార్పు, విపత్తు ప్రమాద నివారణల గురించి వివరించారు. చివరగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఓ.మధు, డాక్టర్ డి.సతీష్ కుమార్ ఈ ప్రోగ్రాంకు విచ్చేసిన అతిథులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపి, మెమోంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలనాధికారి పారుపెల్ల రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా అఖిలపక్ష నాయకుల ర్యాలీ

ఆర్డీవోకు వినతిపత్రం అందించిన నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

నవతెలంగాణ - మెట్ పల్లి : మెట్‌పల్లి మండలంలోనీ మెట్ల చిట్టాపూర్ గ్రామంలో గల సర్వే నెంబర్లు 498, 506లలో ఇండస్ట్రియల్ పార్క్, ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకై, ప్రభుత్వ ప్రయత్నాలకి వ్యతిరేకంగా గ్రామస్థులతో కలిసి అఖిలపక్షం నాయకులు మెట్‌పల్లి పట్టణంలో గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి నాయకుడు కంతి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డ బడుగు, బలహీన వర్గాలకి చెందిన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇచినట్టే ఇచ్చి, నకిలీ ఫ్యాక్టరీల ఏర్పాటు పేరిట తిరిగి లాక్కోవడం దారుణమన్నారు. పట్టాదారులకు కనీసం ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండానే వారి భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి భూమిని చదును చేస్తూ, స్వాధీనపరచుకోవడమంటే పేదల పొట్టకొట్టడమే అన్నారు. అనంతరం ఆర్డీవో వినోద్ కుమార్ కి రైతులు, పట్టాదారులతో కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు జగిలి సునీత, సురభి నవీన్‌రావ్, కొమిరెడ్డి కరం, పుప్పాల లింబాద్రి, గ్రామ జేఏసీ నాయకులు పులి సంజీవ్, చింతకుంట దేవేందర్, గొర్రె భీమన్న, రాధారపు హరికష, అఖిలపక్షం నాయకులు అల్లూరి మహేందర్ రెడ్డి, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పసునూరి శ్రీనివాస్, చింతకుంట శంకర్, బొడ్ల రమేష్ , ఎలుక కమలాకర్, రైసోద్దీన్, కంతి రమేష్, జిల్లాపెల్లి దిలీప్, వన్నెల శశి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో పసుపు కొనుగోళ్లు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పసుపుకు మద్దతు ధర అందేలా చూడాలని వినతి




మెట్‌పల్లి 01 : పసుపు కొనుగోళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - మెట్‌పల్లి : మెట్‌పల్లి కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయం మార్కెట్లో పసుపు కొనుగోలు పరిశీలించి మార్కెట్ ఇన్చార్జి కార్యదర్శి రమణను పసుపునకు లభిస్తున్న మద్దతు ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతు తీసుకువచ్చిన పసుపు క్వింటాల్‌కు రూ.4నుంచి 5వేలు మాత్రమే మద్దతు ధర పలకడం వల్ల రైతు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎంపీ అరవింద్ మాటలు నమ్మి మోసపోయారని పసుపుకు మద్దతు ధర కల్పించడం, పసుపు బోర్డు ఏర్పాటు చేయడంలో గోరంగా విఫలం చెందారని ఆరోపించారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర అందక బాధతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం, పక్క రాష్ట్రమైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుకు ఇచ్చిన విధంగా పసుపుకు మద్దతు ధర ప్రకటించి పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో రానున్న ఎన్నికలలో రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తారన్నారు. రాబోవు రోజుల్లో రైతుకు మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి, కిషన్ సెల్ పట్టణ మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి,సంతోష్ రెడ్డి,జెట్టి లక్ష్మణ్,ఉప్పల గంగాధర్,డబ్బా రాజిరెడ్డి, పిడుగు రాజ రెడ్డి,బండి ప్రశాంత్, జెడి రవి రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

శాసనసభ్యులు చెన్నమనేని రమేష్



పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు

నవతెలంగాణ - మేడిపల్లి : మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. తొంబొర్రావు పేట గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.23లక్షల 50వేలు, 3లక్షలతో వాటర్ ప్లాంట్, గుండ్లపల్లి గ్రామంలో రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం ఈద్ లింగంపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు గది నిర్మాణం కోసం రూ.10లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు, కంప్యూటర్ లాబ్ ప్రారంభోత్సవాలతోపాటు సరస్వతి విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు బీజం ప్రాథమిక పాఠశాలలోనే పడుతుందని, గ్రామంలోని పిల్లలందరూ ఈ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవడం చాలా హర్షించదగ్గ విషయమని గ్రామస్తులను అభినందించారు. ప్రపంచ సవాళ్లకు దీటుగా జవాబు చెప్పాలంటే పిల్లలు చదువులో శాస్త్రీయత, నైపుణ్యత సాధించాలి. అనంతరం మేడిపల్లి మండలానికి చెందిన 30మందికి రూ.30లక్షల విలువగల కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ దావ వసంత, వైస్ చైర్మెన్ హరిచరణ్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బుగ్గారం: మండలంలోని లబ్ధి దారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రానున్న రోజుల్లో ఆడపిల్ల తల్లిదండ్రులకు మరింత ఉపయోగకరంగా ఉండేలా పెళ్లి జరిగే రోజునే కళ్యాణ లక్ష్మి చెక్కు అందించేలా ప్రభుత్వం కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బాధినేని రాజేందర్, వైస్ ఎంపీపీ జోగినపెల్లి సుచందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, మండల కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ రెహమాన్, బుగ్గారం గ్రామ సర్పంచ్ మూల సుమలత-శ్రీనివాస్ గౌడ్, వెలుగొండ గ్రామ సర్పంచ్ గాదే తిరుపతి, ఎంపీటీసీ రేండ్ల లక్ష్మీ-రవీందర్, సిరికొండ గ్రామ సర్పంచ్ చెన్నమల దివ్య- ప్రవీణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు - మన బడి' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్ బాబు

నవతెలంగాణ-మేడిపల్లి: మండలంలోని తొంబర్ రావుపేట గ్రామం లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ పాఠశాల, వాటర్ ప్లాంట్‌ను వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు, జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత, వైస్ జడ్పీ చైర్మన్ హరిచరణ్ రావు ప్రారం భించారు .అనంతరం 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు, సర్పంచ్ సత్తమ్మ ధర్మారెడ్డి, ఎంపీటీసీ లావణ్య రాజేశ్వర్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ జీవన్, బద్దం నర్సారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట్రావుపేట గ్రామంలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా'



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు కేంద్రం చేస్తున్న సహాయాన్ని, ఇస్తున్న సబ్సిడీని ప్రజలకు తెలియజేశారు. అనంతరం జగిత్యాల జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కొడిపెల్లి గోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, పనితీరును ఎండగట్టారు. బీజేపీ ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో. సర్పంచ్ జగన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మకిలి ఇజ్రాయిల్, కొండాపూర్ ఎంపీటీసీ మ్యాకల రాజు, యువమోర్చ జిల్లా ప్రదన కార్యదర్శి క్యాథం మహేందర్ రెడ్డి, మేడిపల్లి మండల అధికార ప్రతినిధి దాసరి రఘు, అన్ని భూత్‌ల అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంఛార్జిలు, మండల పదాదికారులు, గ్రామ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన సర్పంచ్

నవతెలంగాణ-మేడిపల్లి: భీమారం మండలంలోని గోవిందారం గ్రామంలో గ్రామ సర్పంచ్ కె.మధుకర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ సహకారంతో గోవిందారం గ్రామానికి చెందిన దురిశెట్టి వర్షిత్‌కు రూ.18 వేలు, జలంధర్‌కు రూ.60 వేలు, అన్నవేని దేవయ్యకు రూ.11 వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాన స్వరాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బుగ్గారం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని ఎల్ఎమ్ కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో బుగ్గారం మండలంలోని శ్రీ సాంబశివ నాగేశ్వరాలయం ఆలయంలో ప్రాణదాత వేదిక నక్క రాజు ఆధ్వర్యంలో శనివారం నుండి 24 గంటల నిర్విరామ మహా శివసంకల్ప గాన స్వరాభిషేకం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రం, గోడప్రతిని సంక్షేమ శాఖ కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజు, గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యం కోసం చేతి పంపులు ఏర్పాటు

ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ డైరెక్టర్ ప్రీతి



నామాపూర్‌లో చేతిపంపును ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రీతి

నవతెలంగాణ-పెగడపల్లి: ప్రజల సౌకర్యం కోసం చేతి పంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ డైరెక్టర్ ప్రీతి తెలిపారు. పెగడపల్లి మండల పరిధిలోని నామాపూర్ గ్రామంలో, ఆమ్లెట్ గ్రామమైన గొల్లపెల్లిలో గురువారం ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బోర్లను సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యం కోసం బోర్లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్ది సంతోష్ , కోఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, కౌన్సిలర్ కరుణ సిస్టర్, ప్రతినిధులు మల్లేశం ,శ్రీనివాస్ రెడ్డి, రమేష్, రూప, స్రవంతి, అరుణ పాల్గొన్నారు.

పెద్ద చెరువును పరిశీలించిన కేంద్ర బృందం



నవతెలంగాణ - ముస్తాబాద్

ముస్తాబాద్‌లోని పెద్ద చెరువును కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో తాగునీరు, సాగునీరు వసతి ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. మల్లన్న సాగర్, రంగనాయక, మానేరు ప్రాజెక్టుల నుండి కాలువల ద్వారా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలలోకి నీళ్లు వస్తాయని అధికారులు తెలిపారు. కేంద్ర బృంద సభ్యులు పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం వాటర్ అవార్డు కూడా ఇస్తారని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో డీఈ రవీందర్, ఏఈ వంశీకృష్ణ పాల్గొన్నారు.

20న జీపీ కార్మికుల పాదయాత్రచేయండి

సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు

నవతెలంగాణ - పెద్దపల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 20న జిల్లా కేంద్రంలో జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. పాదయాత్ర కరపత్రాలను గురువారం పెద్ద కలవల క్యాంపు ఆఫీస్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ తదితర హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 నుండి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర నాయకత్వం పాదయాత్ర నిర్వహిస్తుందని చెప్పారు. అందులో భాగంగా ఫిబ్రవరి 20న అన్ని జిల్లా కేంద్రాల్లో మొత్తం కార్మికులతో పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చిందని తెలిపారు. 20న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి కంచర బాయ్ వద్ద వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహం నుండి కొత్త కలెక్టరేట్ వరకు ఐదు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో జిల్లాలో ఉండే మొత్తం గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొనాలని, తద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి తమ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కాజా, నాయకులు మల్లారపు మల్లేష్, చంటి శ్రీకాంత్, తగరపు తిరుపతి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఇంధనం అందించాలి

అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా



పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా

నవతెలంగాణ - సిరిసిల్ల : వాహనదారులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఇంధనం అందించాలని అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, రెనోవేటెడ్ గెస్ట్ హౌస్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ఇంధనాన్ని ప్రజలకు అందించేందుకు పెట్రోల్ సర్వీస్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్స్ కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను పరిశీలించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అని, బెటాలియన్‌లో ఉన్న అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కే.సుబ్రహ్మణ్యం, జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారధిరెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైటెన్షన్ లైన్ల కింద మంటలు పెట్టవద్దు



నవతెలంగాణ - రామగిరి : రామగుండం పరిధిలో 400 కేవీ అధిక విద్యుత్ లైన్ వర్ల (హై టెన్షన్ లైన్) కింద మంటలు పెట్టవద్దని సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ అన్నారు. గురువారం రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో రామగుండం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. పవర్ గ్రిడ్ వారి 400 కేవీ అధిక విద్యుత్తు లైన్‌ల కింద రైతులు తమ పత్తి, కంది, మిరప, జొన్న, చెరకు మొదలగు పంటల నుండి ఏర్పడిన, మిగిలిపోయినటువంటి ఎండిపోయిన గడ్డి, చెత్త, పుల్లలను తగులపెట్టకూడదని అన్నారు. ఇలా చేయడం వలన లైన్‌లలో అంతరాయం కలుగుతుందని, కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతూ, విద్యుత్ ప్రమాదాలకు దారి తీస్తున్నాయని అన్నారు. మిగతా ప్రాంతాలకు తగిన రీతిలో కరెంట్ సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్ మహేందర్, పంచాయతీ సెక్రెటరీ పెండ్లి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగర్ మానసకు మెమోంటో అందజేత



నవతెలంగాణ - కథలాపూర్ : ఐటీఎఫ్ (ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్) అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ మానసకు ఐటీఎఫ్ నాయకులు మెమెంటో అందజేశారు. ఈ నెల 5న వేములవాడలో ఐటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూట్యూబ్ తల్లి గూగులమ్మ బోనాలు, బద్ది పోచమ్మ అమ్మ వారికి బోనాలు కార్యక్రమం విజయవంతమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఐటీఎఫ్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం మండలానికి చెందిన సింగర్ జుంబర్తి మానస అవార్డు అందుకున్నారు. మానసకు సింగింగ్ అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతోనే చిన్నప్పటి నుంచే ఆమె మంచి సింగర్ కావాలనుకుంది. తను పాఠశాలలలో చదువుతున్నప్పటి నుంచే పాటలు పాడేది. అలాగే పాడుతూ పాడుతూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలంగాణ ఉద్యమంలో సైతం కళాకారిణినిగా రాణించింది. అనేక కార్యక్రమాల్లో తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చింది. ప్రస్తుతం యూట్యూబ్‌లో పాటలు పాడుతోంది. ఐటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసినందుకు ఐటీఎఫ్ ఆధ్వర్యంలో ఆమెకు మెమోంటో అందజేశారు. తనకు అవార్డ్ రావడం పట్ల మానస సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.


మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

నవతెలంగాణ - గోదావరిఖని : గోదావరిఖని మార్కండేయ కాలనీలోని మార్కండేయ శివాలయంలో ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచికట్ల బిక్షపతి తెలిపారు. 18న ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం 7 గంటలకు శివ కల్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటలకు రుద్రహోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. రాత్రి 12 గంటలా 5నిమిషాలకు లింగోద్భవ కాలమందు శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహలింగార్చన నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'డిస్మిస్ చేసిన ప్రకాశ్‌ను విధుల్లోకి తీసుకోవాలి'

నవతెలంగాణ - గోదావరిఖని : భూపాలపల్లికి చెందిన షాట్ ఫైరర్ ప్రకాష్‌ను మిస్ ఫైరింగ్ పేరుతో యాజమాన్యం అక్రమంగా డిస్మిస్ చేసిందని దీనిని ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, వెంటనే అతన్ని విధుల్లోకి తిరిగి తీసుకోవాలని ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ స్టాఫ్ చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందని ఆయన హెచ్చరించారు. నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, ఆకునూరి శంకరయ్య ఉన్నారు.

30 పడకల ఆసుపత్రి కోసం సంతకాల సేకరణ



నవతెలంగాణ - ఇల్లంతకుంట

మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు కోసం బీజేపీ నాయకులు గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో సంతకాలు సేకరణ కార్యక్రమానికి వెళ్లిన నాయకులు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, స్వామి, సంతోష్, రాజు, హరీష్, సాయిప్రసాద్‌రెడ్డిని పోలీసులు ముందే అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని ప్రభుత్వం అబద్దాలు చెప్తూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రసన్న, గంగాధర్, రంజిత్, లక్ష్మణ్, రాజు, భూపతి, నరసయ్య, అరుణ్, అశ్విని, ముత్తక్క పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో అర్ధరాత్రి అలజడి..

హాస్టల్లోకి దూరిన గుర్తు తెలియని యువకుడు

అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నం..?

అలస్యంగా వెలుగులోకి..



పాఠశాల గేట్ ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రులు

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణంలోని కోనాయపల్లి రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అర్ధరాత్రి అలజడి చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. అదివారం తెల్లవారుజామున హాస్టల్‌లోకి ఓ యువకుడు మాస్క్ ధరించి బాలికల గదిలోని ప్రవేశించాడు. నిద్రిస్తున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాలికలు కేకలు వేశారు. దీంతో ఆ యువకుడు పారిపోయినట్లు తెలిపారు. జరిగిన విషయాన్ని విద్యార్థినులు సిబ్బందికి తెలుపగా ఈ విషయాన్ని ఎవరికి చెప్పకూడదని హెచ్చరించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని కొంతమంది విద్యార్థినులు గురువారం పాఠశాలకు వచ్చిన వారి తల్లిదండ్రులకు తెలిపారు. వారు ఆగ్రహం వ్యకం చేస్తూ తమ పిల్లలకు రక్షణ ఏం కల్పిస్తున్నారంటూ అధ్యాపకులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఇదే విషయంపై పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా సంఘటన జరిగింది నిజమేనని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులు స్పందించాలి : మల్లారపు ప్రశాంత్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి

వేములవాడ పట్టణం నడిబొడ్డున ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు రక్షణ లేకపోవడం చాలా దారుణం. పాఠశాలలో ఇంత పెద్ద సంఘటన జరిగినప్పటికీ ఉన్నత అధికారులు ఇటువైపు చూడకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గురుకుల పాఠశాల విద్యార్థినిలకు సరైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వెంటనే అధికారులు స్పందించాలి.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో రాష్ట్రం ముందంజ

నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

నవతెలంగాణ - గంభీరావుపేట



పనులు ప్రారంభిస్తున్న నాఫ్స్‌కాబ్, సెస్ చైర్మన్‌లు

రైతుల విద్యుత్ సమస్యలను అధిగమించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట్ గ్రామంలో గురువారం 20లక్షల వ్యయంతో విద్యుత్ ఫీడర్ ఏర్పాటు కోసం ఆయన సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలపడంతో సమస్య పరిష్కారం కోసం మల్లారెడ్డిపేట్‌లో విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మల్లారెడ్డిపేట గ్రామంలో నూతన సబ్ స్టేషన్ మంజూరు చేశామని, స్థలానికి స్థానిక సర్పంచు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చీటి మహేశ్వరి, ఎంపీపీలు కరుణ, రేణుక, జెడ్పీటీసీలు విజయ, లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కృష్ణారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కంటి వెలుగు అద్దాలు పంపిణీ



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న రెండవ విడత కంటి వెలుగు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన 182 మందికి గురువారం కంటి అద్దాలను మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేట గ్రామానికి 15, హరిదాస్‌నగర్‌కు 52, పదిరకు 29, వీర్నపల్లికి 86 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్టు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ రజిని, ఏఎన్ఎంలు అమృతవల్లి, శారద, శ్యామల, ఆప్రోమెట్రిస్టు మౌనిక, డీఈవో కవిత, ఆశావర్కర్లు వసంత, సరిత, లక్ష్మి, రజిత, కవిత పాల్గొన్నారు.

మర్రిగడ్డలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ - చదుర్తి



మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. వంద మందికి కంటి పరీక్షలు చేసి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సర్పంచ్ జలపతి, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'పేదలను పట్టించుకోని ప్రభుత్వం'



నవతెలంగాణ - బోయినపల్లి

పేదలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ అన్నారు. బోయినిపల్లి మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో పేదలు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు రామంచ అశోక్, కడుకుంట్ల పర్శయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

'కొండగట్టు బాధితులకు న్యాయం చేయండి'

నవతెలంగాణ - బోయినిపల్లి : కొండగట్టు ప్రమాద బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీఎస్పీ అసెంబ్లీ బ్లాక్ అధ్యక్షుడు మహంకాళి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఇటీవల కొండగట్టుకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు ప్రమాదంలో చనిపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. బీఎస్పీ నాయకులు అక్కనపెల్లి శేఖర్, పెగ్గెర్ల మహెందర్, తంగళ్లపల్లి శ్రీనివాస్, ఎడపెల్లి ప్రభాకర్, అలువాల అంజయ్య, ఎడపెల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ - వీర్నపల్లి

ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ కుబేర్‌లో పేరుకుపోయిన బిల్లులు వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సప్లిమెంటరీ బిల్లులు, పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, జీపీఎఫ్ వంటి బిల్లులన్నీ ట్రెజరీలో ఆమోదం పొంది నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల ఖాతాల్లో నగదు జమకావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు సమర్పించే సందర్భంలో వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ కాకున్నా ట్రెజరీలో ఆమోదం పొందింది కాబట్టి ఆ మొత్తాన్ని ఆదాయంలో చూపించి పన్ను కట్టాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. ఆ నగదు ఈ సంవత్సరం మార్చి 31 లోగా ఖాతాలో జమవుతుందో లేదో తెలియదు కానీ ఈ సంవత్సరమే పన్ను కట్టాల్సి వస్తున్నదని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గతేడాది మార్చి 31లోపు నగదు విడుదల కాక పలు బిల్లులు రీ వ్యాలిడేట్ చేయించుకోవలసి వచ్చిందని అన్నారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఇప్పటివరకు ట్రెజరీల్లో ఆమోదం పొంది రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులకు సంబంధించిన నగదును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం




కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

నవతెలంగాణ - ఓదెల

పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద క్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. దూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, ఈవో సదయ్య, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పత్రాలు అందజేత



నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం సీతారం నాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ గణేష్ డిసెంబరు 27న చెరువులో పడి మృతిచెందారు. గణేష్‌కు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఇన్సూరెన్స్ పత్రాలను గురువారం తెలంగాణ భవన్‌లో అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ రవి నాయక్, జనార్ధన్, భూమా ఉన్నారు.

కంటి వెలుగును సందర్శించిన పోగ్రాం ఆఫీసర్



నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని గురువారం పోగ్రం ఆఫీసర్ రజినీ సందర్శించారు. పరీక్షల తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, ఏఎన్ఎంలు సుజాత, మంజుల, కార్యదర్శి రాజు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - జూలపల్లి

కొండగట్టు ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ జూలపల్లి మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చాతళ్ళ కాంతయ్య, నాయకులు బొద్దుల సాయినాథ్, అమరగాని శ్రీనివాస్, జెట్టి సతీష్, మద్దపెల్లి శ్రీనివాస్, మల్లెత్తుల కనకయ్య వొల్లాజి స్వామి, వొల్లాజి అభి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు పటిష్ట భద్రత

- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం
- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-వేములవాడ

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్టు సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బందోబస్తులో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బందికి వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విధుల నిర్వహణపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మొత్తం బందోబస్తును 7 సెక్టార్లుగా విభజించి మూడు షిఫ్టుల పద్ధతిన విధులు కేటాయించినట్టు చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని, ఎక్కడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవస్థానం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటలు పోలీస్ నిఘా ఉండాలని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. దేవాలయాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటి సాయంతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేలా స్పెషల్ పోలీస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్క భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేవిధంగా ప్రతి పోలీస్ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలైన భీమేశ్వర, నగరేశ్వర, కేదారేశ్వర, బద్దీపోచమ్మ నాంపెల్లి, అగ్రహారం దేవాలయాల వద్ద బందోబస్తు ఉంటుందని, భక్తజన సందోహం ఉన్నచోట దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఇతరనేరాలు జరుగకుండా అరికట్టేందుకు క్రైమ్ పార్టీల నిరంతరం నిఘా ఉంటుదన్నారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ కోసం విధుల్లో ఉంటారని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే అధికారులకు తెలియజేయాలని సూచించారు. జాతరకు భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని, ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్‌జామ్ కాకుండా నియంత్రణ చేయాలని అన్నారు. జాతరకు వచ్చే వాహనాల ద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రూట్ మ్యాప్‌లు అన్ని ప్రదేశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు, స్టాపర్స్, కోన్స్, రాత్రి వేళలో ప్రమాదాలు జరగకుండా స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రాజన్న ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, వివిధ జిల్లాల నుండి వచ్చిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ మృతదేహాన్ని బంధువులు పోస్ట్ మార్టం చేయకుండా ఆపి, బలవంతంగా ఆసుపత్రి నుండి బయటకు తీసుకువెళ్ళి రోడ్డుమీద ధర్నా చేశారు. శనివారం జరిగిన ఈ ఘటనపై ఎస్పీ ఒక ప్రకటన జారీ చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని హనుమాన్ తండాకు చెందిన లకావత్ తిరుపతి మృతిచెందగా ఆర్‌ఎంపీ చేపూరి ప్రసాద్ ఇంజిక్షన్ వల్లే చనిపోయాడని బంధువులు ఆందోళన చేశారు. పోలీస్ సిబ్బంది ఎంత చెప్పిన వినకుండా పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తూ బలవంతంగా శవాన్ని ఆసుపత్రి నుండి బయటకు తీసుకువెళ్ళి రోడ్డువెంట సిరిసిల్ల లోని కొత్త చెరువు వద్ద ధర్నా చేశారు. సిరిసిల్ల పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ దాడి చేసిన విషయంపై గురువారం ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపినటుట పేర్కొన్నారు. ఎంతటి వారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, పోలీస్ విధులకు అడ్డు వచ్చిన ఉపేక్షించేది లేదని తెలిపారు.

'మహా' జాతరకు వేళాయే..

- నేటి నుండి మూడు రోజుల పాటు వేడుకలు
- 18న మహా శివరాత్రి
- 4లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- ముస్తాబైన వేములవాడ రాజన్న ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు





నవతెలంగాణ - వేములవాడ

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం 'మహా' శివరాత్రి జాతర వేడుకలకు ముస్తాబైంది. నేటి నుండి మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా 18నన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు 3.50 నుండి 4 లక్షల వరకు భక్తులు రావచ్చని అధికారులు అంచన వేశారు. దీనికి తగినట్టు ఏర్పాట్లన్ని పూర్తి చేశారు. ముఖ్యంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చలవ పందిళ్లు, టెంట్లు, షామియానాలు, వాహనాల పార్కింగ్, క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. 4లక్షల వరకు లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. తాగునీటికి దాతల సహకారంతో 6 ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటులు, చంటిపిల్లల తల్లులకు బేబీ ఫీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనుబంధ ఆలయాలైన శ్రీ భీమేశ్వర ఆలయం, శ్రీ బద్ది పోచమ్మ, నగరేశ్వరా, నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయాల్లోనూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు వచ్చే రహదారుల వెంబడి బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంతో పాటు సరిహద్దు రాష్ట్రాల నుండి జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో 850 బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు సూచనలు చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్, మే ఐ హెల్ప్ యు కేంద్రాల ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, ఇబ్బందులు వస్తే వెంటనే స్పందించేలా జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక టీం లు ఏర్పాటు చేశారు. మొత్తానికి గతేడాది వలే ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తయి రాజన్న ఆలయం తీరొక్క పువ్వులతో, రంగు రంగుల విద్యుత్ దీపాల కాంతులతో అలంకరించబడి "మహా" జాతర శోభను సంతరించుకుంది.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో దాదాపు 2000 మంది సిబ్బందితో భద్రత ఏర్పాట్లను చేపట్టారు. సీసీ కెమెరాల సహాయంతో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు.

పూజల వివరాలు

17న రాత్రి 9గంటలకు నిశీపూజ అనంతరము భక్తుల సౌకర్యార్థము లఘు దర్శనం. కోడెమొక్కుబడి కొనసాగించబడును.
18న
"మహాశివరాత్రి" పర్వదినము రోజున
12గంటలకు నుండి 3-00 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం.
ఉదయం 3.30గంటల నుండి 4వరకు ఆలయ శుద్ధి-మంగళవాయిద్యాలు.
ఉదయం 4 నుండి 4-25 వరకు సుప్రభాతం.
4-25 నుండి 6వరకు ప్రాతఃకాల పూజ అనువంశిక అర్చకుల దర్శనము.
ఉదయం 7గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారితో, ఉదయం 8కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారిచే పట్టువస్త్రాల సమర్పణ.
సాయంత్రం 4గంటలకు శివదీక్ష స్వాముల దర్శనం.
సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన.
రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ కాలమందు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము
19న ఉదయం సుప్రభాతం, మరియు ప్రాతఃకాల పూజ అనంతరం భక్తుల మొక్కుబడుల ఆర్జిత సేవలు ప్రారంభం.

అధికారుల హామీతో రిలే దీక్షల విరమణ

సీపీఐ(ఎం) సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేష్



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న తహసీల్దార్, కమిషనర్

నవతెలంగాణ - సిరిసిల్ల

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల డ్రాలో పేర్లు రాని వారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు అధికారుల హామీతో విరమించినట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు. రిలే దీక్ష వద్దకు స్థానిక మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ విజయ్ కుమార్ గురువారం వచ్చి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో పేర్లు రాని వారందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు దీక్షలను నాలుగో రోజు విరమించినట్టు చెప్పారు. హామీ నెరవేర్చకుంటే మళ్లీ ఉద్యమం చేస్తామని తెలిపారు. అర్హులుగా ప్రకటించి పేర్లు రాని 963మంది వివరాలను అధికారులు అందజేశారు. రిలే దీక్షలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శ్రీరామ్ సదానందం, మోర అజయ్, సూరం పద్మ, రమేష్‌చంద్ర, నక్క దేవదాస్, పోగుల రాజు, సామల కవిత, గట్ల స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - గోదావరిఖని



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను రామగుండం ప్రాంతంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం... సాముహిక వివాహాలు కన్నుల పండుగగా చేపట్టారు. ఆరు జంటలకు వివాహం చేశారు. విజయమ్మ ఫౌండేషన్ ద్వారా పేద జంటలకు వారికి పుస్తే మట్టెలు, బట్టలు, వివాహ సామాగ్రిని అందించారు. ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నాయకురాలు మూల విజయరెడ్డి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, జెడ్పీటీసీ అముల నారాయణ, మాజీ మేయర్ కొంకటి లక్ష్మినారాయణ, కార్పొరేటర్లు అడ్డాల స్వరూపరామస్వామి, దొంత శ్రీనివాస్, పెంట రాజేష్, సాగంటి శంకర్, ఇంజపురి పులిందర్, దాతు శ్రీనివాస్, అడ్డాల గట్టయ్య, కల్వచర్ల కృష్ణవేణిభూమయ్య, బాదె అంజలి, పాముకుంట్ల భాస్కర్, కవిత సరోజిని పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ - ముత్తారం



ఆవిష్కరిస్తున్న నాయకులు

మంథని నియోజక వర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 20న పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను ముత్తారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ జక్కుల ముత్తయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటాతో సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఎస్ఎల్‌బి గార్డెన్స్‌లో జరిగే ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 81849 82616, 94949 91439, 90009 37805, 95027 41678, 88862 65003 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ముత్తారం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రాగుల సతీష్ పటేల్, పోతారం సర్పంచ్ నేతేంట్ల మహేందర్, మచ్చుపేట సర్పంచ్ మెడగొని సతీష్, దర్యాపూరు సర్పంచ్ గాధం స్రవంతిశ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామగండ్ల మధుకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్
- కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25వేల చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కోలేటి దామోదర్

నవతెలంగాణ - గోదావరిఖని

తెలంగాణ అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం గోదావరిఖని మార్కండేయ కాలనీలో ఆయన స్వగృహం వద్ద నిరుపేద మహిళలకు కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25వేల చీరలను పంపిణీ చేశారు. 1, 20, 21, 22వ డివిజన్లలో కూడా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోలేటి ఫౌండేషన్ బాధ్యులు కోలేటి శ్రీనివాస్, పల్లె రమేష్, బొబ్బిలి సతీష్, సుధీర్‌గౌడ్, నరేష్, చందు, సాయి, రాజయ్య, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటల కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ - గోదావరిఖని



మాయమాటతో మోసం చేస్తున్న కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర గురువారం 32, 44వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎండి.ముస్తాఫా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థలం ఉన్న ప్రతీ పేదవాడికి ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు సాయం అందిస్తామని, వరంగల్ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని అన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు, భూమిలేని వారికి రూ. 15 వేల సాయం అందిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళీ స్వామి, తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా సమాఖ్య కళాకారులు

నవతెలంగాణ - వేములవాడ



రాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య కళాకారులు గురువారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో నాటకానికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను కలిసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, గౌరవ అధ్యక్షుడు బొడ్డు రాములు, జిల్లా అధ్యక్షుడు సావనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, కోశాధికారి బుర్రి శంకరయ్య, సాంస్కృతిక కార్యదర్శి వెంపటి సంతోష్ కుమార్, ప్రచార కార్యదర్శి ఆడెపు చందు, మొగిలోజు లక్ష్మీరాజం, ఎర్ర దేవయ్య ఉన్నారు.

తెలుకుంటలో శ్రీ సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

నవతెలంగాణ - జూలపల్లి

జూలపల్లి మండలం తెలుకుంట గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అద్భుతమైన ఆలయ నిర్మాణ కార్యక్రమాన్ని దిగ్విజయవంతంగా పూర్తిచేయడం గొప్ప విషయమని 1991-1992 పదోతరగతి బ్యాచ్ మిత్ర బృందాన్ని అభినందించారు. అనంతరం కొనరావుపేటలో మల్లికార్జున స్వామి పట్నాలకు హాజరయ్యారు. పెద్దాపూర్‌లో రూ.5లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుకుంట సర్పంచ్ సొల్లు పద్మశ్యామ్, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవిరాంగోపాల్‌రెడ్డి, పెద్దాపూర్ సర్పంచ్ కంకణాల భారతిజ్యోతిబస్సు, నాయకుడు చొప్పరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కటికనపల్లిలో కంటివెలుగు వైద్య శిబిరం

నవతెలంగాణ - ధర్మారం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

మండలంలోని కటిక నపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ బాలరాంరెడ్డి గురువారం ప్రారంభించారు. మార్చి ఒకటి వరకు నిర్వహించే శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమ జయశీల, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పూసుకూరి జితేందర్‌రావు, గ్రామ సర్పంచ్ కారుపాకల రాజయ్య, ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి

నవతెలంగాణ - పెద్దపల్లి : జిల్లా స్థాయి చదరంగంలో గెలుపొందిన మహిళలు రాష్ట్ర స్థాయిలో రాణించాలని పెద్దపల్లి జిల్లా యువజన, క్రీడల అధికారి వై.తిరుపతిరావు అన్నారు. గురువారం స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళా చదరంగపు క్రీడా పోటీలలో మొత్తం 23 మంది పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ఎం.విజేత, ద్వితీయ స్థానంలో టి.వినీల నిలిచారని, వీరిని ఎల్బి స్టేడియంలో 17న నిర్వహించే రాష్ట్ర స్థాయి చదరంగం క్రీడా పోటీల కోసం పంపించినట్టు తెలిపారు.

ఫారెస్ట్ అధికారుల తీరును వ్యతిరేకిస్తూ రైతుల నిరసన

నవతెలంగాణ - ముత్తారం



నిరసన తెలుపుతున్న రైతులు

ఫారెస్ట్ అధికారుల తీరును నిరసిస్తూ ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లాల పల్లె గ్రామానికి చెందిన రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సముద్రాల రమేష్ మాట్లాడుతూ జిల్లాలపల్లె గ్రామానికి చెందిన రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఐకెపి కేంద్రాల్లో అమ్మడం కోసం స్థలం లేకపోవడంతో పక్కనే ఉన్న గోపాల్పూర్ శివారులోని ఫారెస్ట్ ల్యాండ్‌లో రైతులు పండించిన పంట అమ్ముకోవడం కోసం స్థలం కావాలని గ్రామంలోని రైతులందరూ గతంలో ఫారెస్ట్ పెద్దపల్లి జిల్లా డిఎఫ్ఓకు వినతిపత్రం ఇవ్వగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు. గోపాల్ శివారులోని సబ్ స్టేషన్ దగ్గర కొంత స్థలాని రైతులు వాడుకొని పండించిన పంట అమ్ముకోండి అని చెప్పారని, రైతులు చదును చేసుకొని వాడుకుంటూ ఉండగా తీరా కొంతమంది ఫారెస్ట్ అధికారులు వచ్చి రైతులందరూ కష్టపడి చదును చేసిన స్థలంలో దౌర్జన్యంగా అందులో ఫారెస్ట్ సంబంధించిన నీలగిరి చెట్లు పెడతామని చెప్పడం ఎంతవరకు సరైందని అన్నారు. రైతులందరూ కలిసి ఫారెస్ట్ అధికారులు చేసిన చర్యను ఖండిస్తూ ఈ మేరకు రోడ్డుపై ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ



అందజేస్తున్న వైద్యాధికారి

నవతెలంగాణ - ముత్తారం

కంటి వెలుగులో భాగంగా ముత్తారంలో నిర్వహించి శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకొని కళ్ల అద్దాలు అవసరమున్న 31 మంది కోసం ఆర్డర్ చేయగా గురువారం వచ్చాయి. ఈ మేరకు మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు వాటిని లబ్ధిదారులకు శిబిరం ఆవరణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌నర్స్ లలిత, ఏఎన్ఎంలు స్రవంతి, రమాదేవి తదితరులున్నారు.

కేసీఆర్ గోల్డ్ కప్

కోరుకంటి కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - గోదావరిఖని : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేసీఆర్ గోల్డ్ కప్ కోరుకంటి ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గురువారం పోటీల వాల్‌పోస్టర్‌ను కోదండ రామాలయ ఆవరణలో ఎమ్మెల్యే అవిష్కరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసిఆర్ గోల్డ్ కప్ కోరుకంటి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 17 నుంచి గోదావరిఖని జవహర్ లాల్ స్టేడియంలో నిర్వహించనున్నామని తెలిపారు. మొదటి బహుమతిగా 40 వేలు, రెండవ బహుమతి 30 వేలు, 3వ బహుమతి 20 వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్, నాయకులు అడ్డాల రామస్వామి, గంగ శ్రీనివాస్, కాల్వ శ్రీనివాస్, కబడ్డీ కో ఆర్డినేటర్స్ రాజశేఖర్, రమేష్, శ్యాంకుమార్, ప్రేమ్ కిషోర్, తదితరులున్నారు.

బిఎంఎస్‌తోనే కార్మికుల సమస్యల పరిష్కారం

సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

నవతెలంగాణ - గోదావరిఖని : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం బిఎంఎస్‌తోనే సాధ్యం సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని 2వ గనిపై గురువారం సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తి వేతన పరిష్కారాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ఏకాభిప్రాయంతో ఆందోళన కార్యక్రమాలు చేయాలని తీర్మానం చేశారు. 18, 19, 20, 21న గనుల వద్ద గేట్ మీటింగ్‌ల ద్వారా కార్మికులను చైతన్యపరుస్తామని, 21న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ల కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శన పెద్ద ఎత్తున ధర్నాలు, మెమోరాండం ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, పోతరబోయిన విజయ్ కుమార్, బోడకుంట రాజేశం, తదితరులున్నారు.

వాహనాలు తనిఖీ చేసిన రవాణా శాఖ అధికారులు

నవతెలంగాణ - పెద్దపల్లి : రవాణా పన్ను కట్టని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుండి పెద్దపల్లి జిల్లాలో తనిఖీలు చేపట్టినట్టు జిల్లా రవాణా శాఖ అదికారి పీ.రంగారావు తెలిపారు. 19 వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ - గోదావరిఖని : ఫిబ్రవరి 22న జరిగే సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి కోరారు. అంతర్గాం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, పెండ్యాల రమేష్, కట్ట తేజేశ్వర్, భూషవేణి కృష్ణ, నస్పూర్ లక్ష్మి, గొల్లపల్లి చంద్రయ్య, ఆలకుంట ఎల్లయ్య, తదితరులున్నారు.

'నాణ్యమైన పత్తికి మంచి ధర'

నవతెలంగాణ - పెద్దపల్లి : నాణ్యత ప్రమాణాలు పాటించి 8శాతం తేమ కలిగి ఉన్న పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకొని రావాలని పెద్దపల్లి మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. గోనె సంచిలో పత్తిని నింపేటప్పుడు ఒక క్వింటాల్‌లోపు మాత్రమే ఉండాలని, నీళ్లతో తడిపిన పత్తికి కొనుగోలుదారులు ధర పెట్టారని తెలిపారు. ప్రతి రైతు నాణ్యత ప్రమాణాలు పాటించి ఉదయం 9 గంటల లోపల లాట్ నంబర్ పొంది వ్యాపారస్తులకు కొనుగోలు నిమిత్తము మార్కెట్ యార్డ్ కు సంబంధిత కమిషన్ ఏజెంట్ ప్రదర్శనకు ఉంచాలన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని మార్కెట్ యార్డ్‌కు శని, ఆది, సోమవారం సెలవని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ ఖాతా ఓపెన్

నవతెలంగాణ - పెద్దపల్లి : ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోస్టాఫీసుకు రాకుండానే వారి ఇంటి వద్దనే ఆన్ లైన్ ద్వారా పోస్టల్ ఖాతా తెరుచుకునే వెసులుబాటు కల్పించిందని కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టాఫీసుకీ వెళ్ళకుండానే మీ ఇంటి వద్దనే ఉండి పోస్టాఫీసు ఖాతా ఓపెన్ చేయాలనుకునే వారు పోస్టు ఇన్ఫో (ృఉూ క్ష్మీచీఖీఉ) అనే అప్లికేషన్ డౌన్ లోడ్ చేసుకుని దాని ద్వారా వారి చిరునామా, ఇతర వివరాలు నమోదు చేసి "సర్వీస్ రిక్వెస్ట్" రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు. సర్వీస్ రిక్వెస్ట్ వచ్చిన వెంటనే సంబంధిత పోస్టుమాన్ మీ ఇంటి వద్దకు అకౌంట్ ఓపెన్ చేసేందుకు అవసరమైన అప్లికేషన్ ఫారమ్స్ తీసుకొని వచ్చి వాటిని పూరించడంలో మీకు సహకరించి పూరించిన అకౌంట్ ఓపెనింగ్ అప్లికేషన్, డబ్బులు మీ వద్ద నుండి సేకరించుకొని పోస్టాఫీసులో అందజేస్తాడని పేర్కొన్నారు. పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత సంబంధిత పోస్ట్‌మాన్ మీ ఇంటి వద్దకు వచ్చి మీకు పాస్ బుక్ కూడా అందజేస్తారని, ఈ సేవకు ఎలాంటి అదనపు రుసుం ఉండదని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల వితరణ

నవతెలంగాణ - ఇల్లంతకుంట



అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మండలంలోని గాలిపెల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 30మందికి గురువారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను అందించారు. 2017-18 సంవత్సరం పూర్వ విద్యార్థులు వారి స్నేహితుడు కీర్తిశేషులు గుంటి శేఖర్ జ్ఞాపకార్థం అందజేశారు. వారు మాట్లాడుతూ పదోతరగతిలో 10/10 జిపిఏతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అజీం పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్, మధుకర్, శ్రీనివాస్, వనరాజు, రజిత, సుజాత, లత, స్రవంతి, సునీత పాల్గొన్నారు.

నవచిత్రం

సార్.. ఫలితంపై ఎంతో నమ్మకంగా ఉన్నాం



ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు)/ 'వాతి' (తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయి లో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో సినీ ప్రముఖు లు, అభిమానుల సమక్షంలో ఈ వేడుక ఎంతో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథి గా హాజరైన దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'గురువుల గురించి సిని మా తీసిన వెంకీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వెంకీ చెప్పిన కథని నమ్మి ఈ సినిమా చేసిన ధనుష్‌కి ధన్యవాదాలు. నిర్మాతల్లో ఒకరైన నా భార్య ఈ సినిమా చూసి.. కథగా విన్నప్పుడు కంటే, సినిమాగా చూసినప్పుడు ఇంకా బాగుంది అని చెప్పింది. నేను కూడా ఈ సినిమా చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. ప్రతి కథ కి ఒక ఆత్మ ఉంటుంది. ఈ కథ తాలూకు ఆత్మ ఏంటంటే.. విద్య, వైద్యం లాంటి మౌలిక సదుపాయాలు డబ్బుతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉండాలనేది ప్రపంచం మనకి నేర్పుతున్న పాఠం. కానీ వాటినే సామాన్య జనాలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ప్రపంచం మొత్తం చూసే స్థాయికి తీసుకెళ్లగలిగేది చదువు. అంత గొప్ప ఆయుధాన్ని కేవలం డబ్బు మీకు లేదని ఒక కారణం మూలంగా వాళ్ళకి దూరం చేయడం ఎంతవరకు రైట్?. ఈ ప్రశ్నే ఈ సినిమాలో వెంకీ అడిగే ప్రయత్నం చేశాడు. అలాగే టీచర్, స్టూడెంట్‌కి మధ్య ఉండే రిలేషన్ చాలా పవిత్రమైనది. మనం ఎంత దూరం ప్రయాణం చేసినా కూడా మన గురువులు మనతో పాటే ఉంటారు. అలాగే ఈ 'సార్' సినిమా కూడా మనతో పాటు చాలాకాలం పాటు ప్రయాణించే సినిమా అవుతుంది' అని తెలిపారు. '2002లో నా మొదటి తమిళ సినిమా విడుదలైంది. ఇప్పుడు 2023లో నా మొదటి తెలుగు సినిమా విడుదలవుతోంది. అప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. ఇప్పుడు కూడా నాకు అలాంటి ఫీలింగే కలుగుతుంది. ఇది అద్భుతమైన ఎమోషన్స్, మెసేజ్‌తో కూడిన సింపుల్ సినిమా. మేం ఒక అర్థవంతమైన సినిమా చేశాం అని హీరో ధనుష్ అన్నారు. ధనుష్ ఒక నాగస్వరం. ఆయన నటిస్తుంటే.. ఆయన ఒక్కడే కనిపిస్తాడు, ఆయన ఒక్కడే వినిపిస్తాడు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం రావడం గర్వంగా ఉంది' అని దర్శకుడు వెంకీ అట్లూరి అన్నారు. కథానాయిక సంయుక్త మీనన్ మాట్లాడుతూ, 'సినిమా ప్రివ్యూ చూశాక ఫలితంపై నా కాన్ఫిడెన్స్ రెట్టింపు అయింది. ముఖ్యంగా నిర్మాత వంశీ ఈ సినిమా విజయం పట్ల చాలా నమ్మకంగా ఉన్నారు. దర్శక, నిర్మాతలకు, త్రివిక్రమ్‌కి ధన్యవాదాలు' అని తెలిపారు.



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.